




# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States








సంపుటి : 23 | సంచిక : 196 | ది.8-10-2024 | విజయవాడ | మంగళవారం | పేజీలు : 8 | వెల : రూ.1/-


# ఆంధ్రప్రదేశ్ ఆదుకోండి..

- ప్రధాని మోదీ, అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం చంద్రబాబు భేటీ
- బుడమేరు వరదలపై నివేదిక ఇచ్చాక తొలిసారి ప్రధానిని కలిసిన సీఎం.
- రైల్వే జోన్, సెయిల్‌లో విశాఖ ఉక్కు విలీనం, వరద నిధులపై చర్చ







**న్యూ ఢిల్లీ,అక్టోబరు 7 (వార్తాప్రభ) :** ముఖ్యమంత్రి చంద్రబాబు దిల్లీలో ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి చెందిన కీలక అంశాలపై దాదాపు గంటపాటు ఆయన ప్రధానికి వివరించారు. ఇటీవల భారీ వర్షాలు రాష్ట్రాన్ని అతలాకుతలం చేయగా, బుడమేరు పొంగి విజయవాడను ముంచెత్తింది. బుడమేరు వరదలపై నివేదిక ఇచ్చిన తర్వాత తొలిసారి ప్రధానితో భేటీ అయిన సీఎం చంద్రబాబు వరదలకు నష్టపోయిన రాష్ట్రానికి మరిన్ని నిధులు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. అలాగే పోలవరం ప్రాజెక్ట్ పనులు తిరిగి ప్రారంభించాలని, మరో సీజన్ నష్టపోకుండా నవంబర్‌లో వరద తగ్గుముఖం పట్టగానే కొత్త డయాఫ్రంవాల్ నిర్మాణ పనులు ప్రారంభించి వేసవి కల్లా పూర్తిచేసేలా సహకరించాలని చంద్రబాబు ప్రధానికి విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. ప్రధానితో సమావేశం ముగిసిన వెంటనే చంద్రబాబు తన అధికార నివాసానికి వెళ్లిపోయారు. అక్కడ రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో చంద్రబాబు భేటీ అయ్యారు. కేంద్ర ప్రాజెక్టులకు పెండింగ్ నిధులు మంజూరుతోపాటు విశాఖ రైల్వే జోన్ పురోగతిపైనా కేంద్రమంత్రితో చర్చిస్తున్నారు. అమరావతికి అనుసంధానమయ్యే రైల్వే ప్రాజెక్టుల గురించి చర్చించనున్నారు. రాష్ట్రంలోని పోర్టుల అభివృద్ధి, అనుసంధానంపైనా కేంద్రమంత్రితో భేటీలో చంద్రబాబు వివరించనున్నారు. మంగళవారం కూడా పలువురు కేంద్రమంత్రులతో సీఎం చంద్రబాబు భేటీ కానున్నారు. రాత్రికి దిల్లీలోనే బస చేయనున్న చంద్రబాబు, మంగళవారం ఉదయం ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలుస్తారు. అమరావతి ఓ.ఆర్.ఆర్.సహా జాతీయ రహదారుల అభివృద్ధికి నిధుల గురించి మాట్లాడతారు. ఉదయం 11.30 గంటలకు కేంద్రమంత్రి గడ్కరీతో సమావేశం అయ్యాక, సాయంత్రం పీయూష్ గోయల్, హర్‌దీప్‌సింగ్ పురిని కలవనున్నారు. మంగళవారం రాత్రి 8 గంటలకు హోంమంత్రి అమిత్‌షాతో చంద్రబాబు భేటీ కానున్నారు. అనంతరం రాత్రి 11 గంటలకు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తోనూ చంద్రబాబు సమావేశం కానున్నారు.

# హైదరాబాద్ సీఎస్ఎంపీని అమృత్ 2.0లో చేర్చండి

- మెట్రో రైలు రెండో దశకు మద్దతు ఇవ్వండి
- కేంద్ర మంత్రి ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి



**న్యూఢిల్లీ,అక్టోబరు 7 (వార్తాప్రభ) :** హైదరాబాద్ సమగ్ర సీవరేజీ మాస్టర్ ప్లాన్ ను(సీఎస్ఎంపీ) అమృత్ 2.0లో చేర్చాలని లేదా ప్రత్యేక ప్రాజెక్టుగా చేపట్టాలని కేంద్ర పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి ఖట్టర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం కలిశారు. చారిత్రక హైదరాబాద్ నగరంలో పురాతన మురుగుశుద్ధి వ్యవస్థనే ఉందని, అది ప్రస్తుత అవసరాలకు తగినట్లుగా లేదని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. హైదరాబాద్ సమీప పురపాలక సంఘాల్లోనూ సరైన మురుగు నీటి పారుదల వ్యవస్థ లేదని కేంద్ర మంత్రి దృష్టికి ఆయన తీసుకెళ్లారు. హైదరాబాద్‌లో ప్రజల జీవన ప్రమాణాలు ప్రపంచ స్థాయి నగరంలో మాదిరి ఉండాలంటే నగరంతో పాటు సమీప మున్సిపాలిటీల్లో 100 శాతం ద్రవ వ్యర్థాల శుద్ధి చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి ఖట్టర్‌కు వివరించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌తో పాటు సమీప 27 పురపాలక సంఘాలతో కలుపుకొని కలిపి 7,444 కి.మీ.మేర రూ.17,212.69 కోట్లతో సీఎస్ఎంపీకి డీపీఆర్ రూపొందించినట్లు ఖట్టర్‌కు సీఎం తెలిపారు. ఆ డీపీఆర్‌ను కేంద్ర మంత్రి ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందజేశారు. సీఎస్ఎంపీని అమృత్ 2.0లో చేర్చి ఆర్థిక సహాయం చేయడం లేదా ప్రత్యేక ప్రాజెక్టుగా గుర్తించి నిధులివ్వాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. హైదరాబాద్ నగరంలో 55 కి.మీ. మేర మూసీ నది ప్రవహిస్తోందని, ఇరువైపులా కలిపి 110 కి.మీ.మేర నగరంలోని మురుగు అంతా మూసీలోనే చేరుతోందని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇలా మురుగు మూసీలో చేరకుండా ఉండేందుకు ట్రంక్ సీవర్స్ మెయిన్స్, లార్జ్ సైజ్ బాక్స్ డ్రెయిన్స్, కొత్త సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణానికి రూ.4 వేల కోట్లతో డీపీఆర్ రూపొందించినట్లు కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి తెలిపారు. ఆ డీపీఆర్‌ను కేంద్ర మంత్రి ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి సమర్పించారు. ఆ డీపీఆర్‌ను ఆమోదించడంతో పాటు పనుల అనుమతికి చొరవ చూపాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించి నాగోల్-శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (36.8 కి.మీ.), రాయదుర్గం-కోకాపేట నియోపొలిస్ (11.6 కి.మీ.), ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ.), మియాపూర్-పటాన్‌చెరు (13.4 కి.మీ.), ఎల్‌బీ నగర్-హయత్ నగర్ (7.1 కి.మీ.) మొత్తం 76.4 కి.మీ. మేర డీపీఆర్‌లు పూర్తయినట్లు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేశారు. ఈ కారిడార్ల నిర్మాణానికి రూ.24,269 వ్యయం అవుతుందని అంచనా వేశామని, దీనిని కేంద్రం, తెలంగాణ ప్రభుత్వం 50:50 రేషియోలో జాయింట్ వెంచర్‌గా చేపట్టాలని భావిస్తున్నట్లు సీఎం తెలిపారు. త్వరలోనే ఇందుకు సంబంధించిన డీపీఆర్‌ను సమర్పిస్తామని.. అది త్వరగా కార్యరూపం దాల్చేందుకు సహకరించాలని కేంద్ర మంత్రి ఖట్టర్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ముఖ్యమంత్రి వెంట నల్గొండ, భువనగిరి, పెద్దపల్లి ఎంపీలు రఘువీర్ రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, జి.వంశీకృష్ణ, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ ఉన్నారు.

# వన్య ప్రాణుల రక్షణ మనిషి బాధ్యత

- మంగళగిరిలో అరణ్య భవన్ లో నిర్వహించిన వన్య ప్రాణి వారోత్సవ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**విజయవాడ,అక్టోబరు 7 (వార్తాప్రభ) :** 'వసుధైక కుటుంబంలో సమస్త జీవ కోటికి చోటు ఉంది. వాటిలో మనిషి ఒకడు. మనకున్న సాంకేతికత, విజ్ఞానంతో ఇతర జీవ రాశుల కంటే మనం ఉన్నత దశలో ఉన్నాం. మనపై ఆధారపడిన, మనతోపాటు జీవనం సాగించే ఇతర జీవ రాశులన్నింటినీ రక్షించుకుంటేనే మనిషి సాగిస్తున్న ఈ దశ స్వచ్ఛంగా సాగిపోతుంది. ఈ మాటలనే వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు చెబుతున్నాయి' అని ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి శ్రీ కొణిదల పవన్ కళ్యాణ్ గారు అన్నారు. వన్య ప్రాణులు, సముద్ర జీవులు, ఇతర జీవరాశి పూర్తి మనుగడలో ఉంటేనే మనిషికి స్వచ్ఛమైన గాలి, నీరు అందుతుంది. ఇతర జీవుల మనుగడ మీద మన ఉనికి ఆధారపడి ఉందనే విషయం నిత్యం గుర్తుంచుకోవాలని సూచించారు. పర్యావరణ, వన్య ప్రాణుల సంరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని అన్నారు. మంగళగిరిలోని అరణ్య భవన్ లో నిర్వహించిన 70వ వన్య ప్రాణి వారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు హాజరయ్యారు. అటవీ శాఖ ఉన్నతాధికారులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ "వన్య ప్రాణుల రక్షణ అనేది మన జీవన విధానంలో భాగం కావాలి. నల్లమల చెంచులు తమ జీవన విధానంలో వణ్యప్రాణులను దేవుళ్లుగా భావిస్తారు. పెద్దపులిని పెద్దమ్మ దేవుడుగా, ఎలుగు బంటిని లింగమయ్యగా, అడవిపందిని బంగారు మైసమ్మగా, రేసుకుక్కను బవరమ్మగా కొలుస్తారు. మన వేదాలు, పురాణాల్లో సైతం మత్స్యావతారం, కూర్మావతారం, వరాహ అవతారానికి విశిష్టత ఉంది. మనతో పాటు వన్య ప్రాణుల రక్షణ, వాటికి ఇవ్వాల్సిన విలువ గురించి పురాణగాథలు చెప్పే గొప్ప విషయాలు ఇవే. సముద్ర జీవుల్ని రక్షించడానికి ప్రత్యేకంగా ఓ సంస్థ పని చేయడం నాకు ఆనందం కలిగించింది.


# హైడ్రాపై తప్పుడు ప్రచారం మానుకోవాలి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- హైదరాబాదులో చెరువుల్లో ఆక్రమణలు
- హైడ్రా తీసుకువచ్చి ఆక్రమణలు తొలగిస్తున్న కాంగ్రెస్ సర్కారు
- ప్రజలకు మేలు చేస్తుంటే తప్పుడు ప్రచారాలేంటన్న భట్టి విక్రమార్క




**హైదరాబాదు,అక్టోబరు 7 (వార్తాప్రభ) :** హైదరాబాద్ పరిరక్షణే తమ లక్ష్యమని, హైడ్రాపై తప్పుడు ప్రచారాలు మానుకోవాలని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్రజలకు మేలు చేయాలని పాటుపడుతుంటే, అసత్య ప్రచారాలేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ అంటేనే కొండలు, గుట్టలు, చెరువులు, పార్కులు అని అభివర్ణించారు. అనేక చెరువులు, పార్కులు కబ్జాలకు గురయ్యాయని భట్టి విక్రమార్క వివరించారు. నగరంలో చిన్న వర్షానికే ఇళ్లలోకి నీళ్లు వస్తున్నాయని తెలిపారు. మూసీ ప్రక్షాళన సమాజ శ్రేయస్సు కోసమేనని, మూసీని మణిహారంలా మార్చాలన్నదే తమ ఉద్దేశమని అన్నారు. మెరుగైన హైదరాబాద్ నగరాన్ని భవిష్యత్ తరాలకు అందించాలన్నదే తమ అభిమతమని, ఇందులో ప్రజా అజెండా తప్ప వ్యక్తిగత అజెండా లేదని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మూసీ బాధితులను తప్పకుండా ఆదుకుంటామని, తొలగించిన ఇళ్లకు బదులు మరో చోట ఇళ్లు ఇచ్చే బాధ్యత తమదేనని ఉద్ఘాటించారు.


# మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్స్ నందు స్మైల్ 500 ఆవిష్కరణ







**విజయవాడ, అక్టోబరు 7 (వార్తాప్రభ) :** మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్స్ అత్యాధునిక స్మైల్-500 టెక్నాలజీని నగరంలో ప్రారంభించడంతో రెఫ్రాక్టివ్ శస్త్ర చికిత్సలలో నూతన అధ్యాయాన్ని ఆవిష్కరించింది. ఈ స్మైల్ టెక్నాలజీని విజయవాడ లోక్‌సభ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని), తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే గద్దె రామమోహన్, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావులు ముఖ్యఅతిధులుగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ స్మైల్ టెక్నాలజీ రెఫ్రాక్టివ్ లోపాలను సరిచేయడం కోసం అత్యాధునిక లేజర్ శస్త్రచికిత్స. ఈ శస్త్ర చికిత్స వలన మిగతా లాసిక్ శస్త్ర చికిత్సల కంటే వేగంగా కోలుకోవడంతోపాటు అసౌకర్యాలకు గురికాకుండా ఉంటారు. స్మైల్ 500 కంటి అద్దాలు లేకుండా కాంటాక్ట్ లెన్సెస్‌పై ఆధారపడకుండా ఉండాలనుకునే వారికి అత్యుత్తమ మరియు సురక్షితమైన శస్త్రచికిత్సా పద్ధతి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ అతిధులు డా. కాసు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ "స్మైల్-500 టెక్నాలజీ" ద్వారా రోగులకు మేము మినిమల్ ఇన్వేసివ్ పద్ధతిలో స్పష్టమైన దృష్టిని తిరిగి పొందే అవకాశం కల్పిస్తున్నామన్నారు. స్మైల్ 500 ఆవిష్కరణ వక్రీభవన శస్త్రచికిత్సలో అద్వితీయమైన పురోగతి సాధిస్తుందని, రోగి త్వరగా కోలుకోవడానికి మరియు అధిక సౌలభ్యతను చేకూర్చుతుందన్నారు. అత్యాధునిక స్మైల్ 500 వంటి సాంకేతికను తీసుకురావడానికి మాక్సివిజన్ కృషి చేస్తుందన్నారు. స్మైల్ 500 తో తమ రోగులకు ఉత్తమ ఫలితాలను అందించడం ద్వారా వారికి స్పష్టమైన దృష్టిని తిరిగి పొందుటకు తాము కట్టుబడి ఉంటామన్నారు. మాక్సివిజన్ గ్రూప్ సీఈఓ వీఎస్ సుధీర్ మాట్లాడుతూ "మాక్సివిజన్" ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలో అత్యంత ప్రతిష్టాత్మకమైన కంటి ఆసుపత్రులలో ఒకటి అన్నారు. విజయవాడ హాస్పిటల్ నేత్ర సంరక్షణకు అత్యంత కీలకమైన గమ్యస్థానమన్నారు. స్మైల్ టెక్నాలజీకి రూ. 8 కోట్ల పెట్టుబడి చేయడం ద్వారా విజయవాడలోనే అత్యాధునిక రెఫ్రాక్టివ్ శస్త్ర చికిత్సలను అందించడంతో రోగులు హైదరాబాద్‌కు వెళ్ళవలసిన అవసరం లేకుండా ఇక్కడే అత్యాధునిక నేత్ర చికత్సలను తక్కువ ధరలకు పొందవచ్చన్నారు. ఒక డాక్టర్‌తో ప్రారంభమైన మాక్సివిజన్ నేడు 150కి పైగా డాక్టర్లతో 1200 మంది పైగా సిబ్బందితో విస్తృతపరిచామన్నారు. మాక్సివిజన్ సూపర్ స్పెషాల్టీ ఐ హాస్పిటల్స్ 1996లో డా. కాసు ప్రసాద్‌రెడ్డిచే స్థాపించబడిందని, 2011లో డా. జి.ఎస్.కె. వేలు కొనుగోలు చేశారని, ప్రస్తుతం ఈ ఐ ఆసుపత్రి దక్షిణ మరియు పశ్చిమ భారతదేశంలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ మరియు గుజరాత్‌లలో విస్తరించిందన్నారు. మాక్సివిజన్ గ్రూపులో 50 ఆసుపత్రులలో 25 ఆసుపత్రులు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలో ఉన్నాయన్నారు. మా విజయవాడ ఆసుపత్రి విజయవాడ, గుంటూరు మరియు నరసరావుపేట జిల్లాలలో పెద్ద సంఖ్యలో ప్రజలకు కంటి సంరక్షణ సేవలు అందించడంలో గుర్తింపు పొందిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణలకు క్లీనికల్ హెడ్‌గా మూడు దశాబ్దాలకు పైగా అనుభవం కలిగిన కంటి శస్త్ర చికిత్సలో నిపుణులైన డా. శరత్‌బాబు, డా. ఏఏవి రామలింగ రెడ్డిలు విజయవాడలోని మా ఆసుపత్రిలో ఈ శస్త్ర చికిత్సలను అందించనున్నారని వారు తెలిపారు. ఈ మాక్సివిజన్ ఐ ఆసుపత్రి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. అత్యాధునిక, సాంకేతిక మరియు అనుభవజ్ఞులైన నిపుణుల యొక్క కలయికతో రోగులకు ఇక్కడే అత్యుత్తమైన దృష్టిని ప్రసాదించుటకు కృషి జరుగుతుందని సీఈఓ డా. సుధీర్ తెలిపారు.

**వార్తాప్రభ - పంచాంగం**

**8-10-2024 మంగళవారం**

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షఋతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం. ఆషాఢమాసం, శుక్లపక్షం

తిథి : పంచమి 11.18 వరకు
నక్షత్రం : జ్యేష్ఠ తె. 4.08 వరకు
వర్జ్యం : ప.8.01 - 9.44 వరకు
దుర్ముహూర్తం : ప. 8.17 నుండి 9.04 వరకు
రా. 10.37 - 11.24 వరకు
రాహుకాలం : మ.2.48 - 4.16 వరకు
మంచి సమయం : లేదు
సూర్యోదయం : 5.55 కి
సూర్యాస్తమయం : 5.46 కి

## శ్రీ శ్రీ మహా చండీ అవతారంలో మారేమ్మ తల్లి అమ్మవారు



**విస్సన్నపేట,అక్టోబరు 7 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని పుట్రేల మారెమ్మ తల్లి అమ్మవారు కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారం శ్రీ శ్రీ మహా చండీ అమ్మవారు అవతారంలో దర్శనమిచ్చారు. శరన్నవరాత్రులు సందర్భంగా భక్తులు పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

## మడ అడవుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



**తాళ్ళరేవు/కోరంగి,అక్టోబరు 7 (వార్తాప్రభ) :** మడ అడవుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు అన్నారు. ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 2వ తేదిన నుంచి 8 వ తేది వరకు వన్యప్రాణి వారోత్స వాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం కోరంగి అభయార్యణ్యం, చొల్లంగి నందు వన్యప్రాణుల వారోత్సవాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. పర్యావరణ అభివృద్ధి కమిటి సభ్యులు, విద్యార్థులు 430 మంది హాజరయ్యారు. పర్యావరణ అభివృద్ధి కమిటీ సభ్యులు, విద్యార్థులు 430 మంది హాజరు అయ్యారు. 20 పర్యావరణం అభివృద్ధి కమిటీలకు రూ.40 లక్షల అభివృద్ధి నిధులు పంపిణీ చేశారు.జిల్లా స్థాయిలో నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు.ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.మడ అడవుల అభివృద్ధికి కృషి చేయ్యాలని పిలుపునిచ్చారు. ఎమ్.పి.పి.రాయడు సునిత గంగాధర్ మాట్లాడుతూ సహజ రక్షణ గోడలుగా ఉన్న మడ అడవులను రక్షంచుకునే బాధ్యత ప్రతి ఒక్కరి పైనా ఉందన్నారు.అటవీశాఖ రెంజర్ ఎస్.ఎస్.ఆర్ వర ప్రసాద్ మాట్లాడుతూ అంతరించిపోతున్న అడవులు, వన్యప్రాణులను కాపాడా ల్సిన బాధ్యత అందరిపైన ఉందని తెలిపారు.కోరంగి అభయారణ్యం అభివృద్ధికి కృషి చేస్తున్నా మని తెలిపారు. పర్యావరణ అభివృద్ధి కమిటీల ద్వార మడ అడవుల పరిరక్షణకు కృషి చేస్తున్ననని తెలిపారు.ఈ నెల 4వ తేదిన వన్య ప్రాణుల వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్ర లేఖన పోటీలలో విజేతలకు ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు చేతల మీదగా బహుమతులు అందించారు.ఈ కార్యక్రమంలో ప్రజ ప్రతినిధులు,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నగర పాలక సంస్థ కార్మికుల సమస్యల పరిష్కారానికి జాయింట్ మీటింగ్ వేయించండి

● జిల్లా గ్రీవెన్స్ లో ట్రైనీ కలెక్టర్ కు సిఐటియు వినతి



**కాకినాడ,అక్టోబరు 7 (వార్తాప్రభ) :** కాకినాడ నగర పాలక సంస్థ పరిధిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి జాయింట్ మీటింగ్ వేయించాలని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం గ్రీవెన్స్ లో సిఐటియు ఆధ్వర్యంలో నగర కన్వీనర్ మలక వెంకట రమణ, కో కన్వీనర్ పలివెల వీరబాబు లు ట్రైనీ కలెక్టర్ హెచ్. ఎస్. భావన కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలివెల వీరబాబు మాట్లాడుతూ నగర పాలక సంస్థ లో పారిశుద్ధ్యం మరియు ఇంజనీరింగ్ విభాగాల్లో పర్మినెంట్, ఆప్కోస్, థర్డ్ పార్టీ కాంట్రాక్టు పద్ధతిలో వేల మంది కార్మికులు సేవలు అందిస్తున్నారని తెలిపారు. వారికి కార్మిక చట్టాల అమలు, కనీస వేతనాలు అమలు, జీతాలు సకాలంలో చెల్లింపులు, సెలవులు అమలు వంటి అనే అంశాల్లో చాలా సమస్యలు ఉన్నాయన్నారు. ఆగస్టు 5 వ తేదీన నగర పాలక సంస్థ కమిషనర్ వారికి పి.జి. ఆర్.ఎస్. వినతి పత్రం సమర్పించామని, కమీషనర్ వారు సానుకూలంగా స్పందించినా , ఆచరణలో అమలు కాలేదన్నారు. కావున జిల్లా కలెక్టర్ వారు నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారిగా జోక్యం చేసుకుని కార్మికుల సమస్యల పరిష్కారానికి జాయింట్ మీటింగ్ వేయించాలని సిఐటియు తరపున కోరుతున్నామని వీరబాబు, రమణ తెలిపారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ నగర పాలక సంస్థ కమిషనర్ మరియు జిల్లా కలెక్టర్ లకు తెలియ చేస్తానని హామీ ఇచ్చారు.

## పెడనలో ప్రజా దర్బార్ నిర్వహించిన ఎమ్ ఎల్ ఎ కాగిత



**పెడన,అక్టోబరు 7 (వార్తాప్రభ) :** పెడనలో సోమవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. పెడన పట్టణం మండలాల సంబంధించి ఈ కార్యక్రమాన్ని శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ ఏర్పాటు చేశారు. పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల పట్టణ ప్రజలు తమ సమస్యలను దరఖాస్తు రూపంలో శాసనసభ్యునికి అందజేశారు. వ్యక్తిగత సమస్యలు గ్రామాల సమస్యలు అనేకం ఈ దర్బార్లో ప్రస్తావించారు ఎన్నికలకు ముందు హామీ ఇచ్చినట్టుగానే ప్రజల సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజాదర్బార్ నిర్వహించామని కాగిత చెప్పారు. ఈసందర్భంగా ప్రజలు తరలివచ్చి వినతి పత్రాలు అందించారు. అందరి సమస్యలు పరిష్కరిస్తానని కాగిత కృష్ణ ప్రసాద్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి అర్జా వెంకట నగేష్ మండల టిడిపి అధ్యక్షుడు శలపాటి వీరప్రసాద్ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గుడిసేవ రామారావు ప్రధాన కార్యదర్శి సీరం ప్రసాద్ పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు

## జీపీఎస్ మత్స్యకారులకు రక్షణ కవచం :ఎమ్మెల్యే కొండబాబు



**కాకినాడ,అక్టోబరు 7 (వార్తాప్రభ) :** మత్స్యకారుల సంక్షేమం కోరుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న (జీపీఎస్)ట్రాన్సపాండర్స్ రక్షణ కవచంలా బహువిధాల ఉపయోగపడుతుందని కాకినాడ నగర ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు(కొండబాబు)అన్నారు. ప్రధానమంత్రి మత్స్యకార యోజన పథకంలో భాగంగా స్థానిక మత్స్యకార బోటు యజమానులకు ట్రాన్సపాండర్స్ స్థానిక జగన్నాథపురం రాష్ట్ర మత్స్యకార సాంకేతిక కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఉచితంగా అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ట్రాన్సపాండర్స్ వేటకు వెళ్ళే బోట్లకు అమరుస్తారని తద్వారా బోట్ల ఉనికి, బోటు లేదా సిబ్బంది ప్రమాదంలో ఉన్నట్లయితే రక్షణకు,వాతావరణ, తుఫాను హెచ్చరికలు అందుకునేందుకు, చేపల సమాచారం తెలుసుకునేందుకు, సముద్రంలో దేశ సరిహద్దులు దాటే సమయంలో హెచ్చరికలు తెలుసుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. గత ప్రభుత్వం మత్స్యకారులకు చేసిందేమీ లేదన్నారు. మత్స్యకారులకు ఇచ్చిన పదవులు, నియమించిన కమిటీలు కేవలం అలంకార ప్రాయంగా మిగిలాయన్నారు. కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు అన్నివిధాలా అండగా ఉంటుందని తెలిపారు.సాంకేతికత వినియోగించుకుని వ్యాపారాభివృద్ధి చెందాలని సూచించారు.ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ ప్రసంగించారు. మత్స్యకార నాయకులు బలసాడి రంగారావు, నాగేశ్వరరావు తదితరులు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ కరుణాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు.సుమారు రెండు వందల మందికి ట్రాన్సపాండర్స్ ను అందజేశారు.కార్యక్రమంలో పలువురు బోటు యజమానులు పాల్గొన్నారు.

# పట్టపగలే బరితెగిస్తున్నారు..!

● మైలవరంలో ఇసుక మాఫియాకు అడ్డుకట్ట ఏది..? ● బుడమేరు వాగును అడ్డగోలుగా తోడేస్తున్నారు. ● సి సి రోడ్లు నిర్మాణం పేరుతో ఇసుక అక్రమ రవాణా..! ● ఇరిగేషన్ అధికారులను సంప్రదించ కుండా ఇసుక తోలుకునేందుకు పర్మిషన్ ఇచ్చిన తహశీల్దార్ ● మా పర్మిషన్ లేకుండా అనుమతులు ఎలా ఇస్తారంటున్న బుడమేరు ఏఈ ● మైలవరంలో ఇష్టానుసారంగా వ్యవహ రిస్తున్న అధికారులు ● ఇంత అరాచకమా...? అని ప్రశ్నిస్తున్న స్థానిక ప్రజలు

ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గం మైలవరం పట్టణంలోని గవర్నమెంట్ ఆసుపత్రి సమీపంలోని సాయి బాబా గుడి వెనుక బుడమేరు వాగు నుంచి పట్టపగలే యదేచ్చగా ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు.ప్రభుత్వ వనరులను కాపాడాల్సిన సంబంధిత శాఖ అధికారు లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నార ని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు.ఇరిగేషన్ అధికారులను సంప్రదించకుండా స్థానిక తహశీల్దార్ ఇసుక తోలుకునేందుకు పర్మిషన్ ఎలా ఇస్తారని బుడమేరు ఏఈ వెంకటేష్ ప్రశ్నిస్తున్నారు.పంచాయతీరాజ్ ఏఈ రమణమ్మ, ఎంపీడీవో అనురాధ చెప్పారని అందుకే పర్మిషన్ ఇచ్చానని తహశీల్దార్ చెప్పడం కొసమెరుపు. బుడమేరు వాగు నుంచి రేయింబవళ్లు ఇసుక తోడేస్తుంటే జిల్లా అధికార యంత్రాంగం మాత్రం చోద్యం చూస్తోంది. బుడమేరులో ఇసుక 'తోడే'ళ్ల ను అడ్డు కోవడంలో సంబంధిత శాఖా అధికారు లు పూర్తిగా విఫలమయ్యారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.బుడమేరు వాగు నుంచి టన్నులకొద్దీ ఇసుక మైలవరం పట్టణానికి తరలిపోతున్నా మైనింగ్ శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటంలేదు.ఇక ఇరిగేషన్ శాఖ అధికారులైతే తమకు ఏమీ పనులు లేవంటూ విజయవాడ ఆఫీసుకు లేదంటే సొంత పనులకే పరిమితమయ్యారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.దీంతో బుడమేరులో ఇసుక మాఫియా రోజురోజుకు పెట్రేగిపో తోంది. మరోవైపు స్థానిక పోలీసులు కూడా చోద్యం చూస్తున్నారు.పోలీస్ స్టేషన్ ఎదురుగా పట్టపగలే యదేచ్చగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా పట్టించు కోవడంలేదని పట్టణ వాసులు గగ్గోలు పెడుతున్నారు.అభివృద్ధి పనుల పేరుతో బుడమేరును అడ్డగోలుగా దోచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. మరి ఇంత అరాచకమా..? అని ప్రశ్నిస్తున్నారు.









**మైలవరం,అక్టోబరు 7 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గం, మైలవరం పట్టణంలో ఇసుక మాఫియాకు అడ్డుకట్ట లేకుండా పోయింది.ఇసుక అక్రమార్కులు పట్టపగలే బరి తెగిస్తున్నారు.బుడమేరు వాగును అడ్డగోలుగా తోడేస్తున్నారు. అయినా సంబంధిత అధికారులకు చీమ కుట్టినట్లయినా లేదు.పట్టపగలే పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తూ అక్రమార్కులు పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారు. బుడమేరు వాగు నుంచి రోజుకు 50 నుంచి 80 ట్రిప్పుల వరకు ఇసుకను తరలిస్తున్నారు. ట్రాక్టర్ ఇసుక (ఒక యూనిట్ ఇసుక )రూ.3500 ల నుంచి రూ.4000 లకు పైగా వసూలు చేస్తున్నా రు.ఇసుక అక్రమ రవాణా జరుగుతుంద ని తెలిసి కూడా ఇరిగేషన్, మైనింగ్, పోలీస్, రెవిన్యూ శాఖా, ఎస్ ఈ బి అధికారులు చూసి చూడనట్లు వ్యవహ రిస్తున్నారని పట్టణ వాసులు అంటున్నా రు.స్థానిక తహసీల్దార్ కార్యాలయం, పోలీసు స్టేషన్ ఎదురుగా ఇసుకను ట్రాక్టర్ల ద్వారా యథేచ్ఛగా తరలిస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకో వడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.సీసీ రోడ్ల నిర్మాణం పేరుతో బుడమేరు ఇసుకను కొంతమంది అక్రమ వ్యాపారంగా మార్చుకున్నారని మైలవరం పట్టణ వాసులు ఆరోపిస్తున్నారు.

**ఇసుక అక్రమ రవాణా పై అధికారుల విచిత్ర వైఖరి :** ఇసుక అక్రమ రవాణా పై అధికారు లను వివరణ కోరగా అందుకు వారు విచిత్ర సమాధానాలు చెప్పటం విశేషం. మైలవరం తహశీల్దార్ ను ప్రశ్నించగా పంచాయతీరాజ్ శాఖ ఏఈ సిమెంట్ రోడ్లు కోసం ఇసుక కావాలని ప్రపోజల్ పెట్టారని అందుకే పర్మిషన్ ఇచ్చానని సమాధానమిచ్చారు.పంచాయతీరాజ్ ఏఈ ని వివరణ కోరగా మైలవరం పట్టణంలోని ఐదు సచివాలయాల పరిధిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 25 వర్క్స్ శాంక్షన్ అయ్యా యని, సిమెంట్ రోడ్ల నిర్మాణానికి కొన్ని క్యూబిక్ మీటర్ల ఇసుక కావాలని ఎంపీడీవో కు ప్రపోజల్ పెట్టడం జరిగింద న్నారు.ఎంపీడీవో ను వివరణ కోరగా పంచాయతీరాజ్ శాఖ ఏఈ ఇసుక కోసం ప్రపోజల్ పెట్టారని తాను తహశీ ల్దార్ కు రిఫర్ చేయడం జరిగిందన్నారు. అంతే తప్ప నాకేం తెలియదన్నారు.

**ఇరిగేషన్ అనుమతులు లేకుండా పర్మిషన్ ఎలా ఇస్తారు :** ఇరిగేషన్ శాఖ అధికారుల అనుమతులు లేకుండా బుడమేరు వాగులో నుంచి ఇసుక తోలుకోవడానికి తహశీల్దార్ పరిమిషన్ ఇవ్వడానికి లేదని బుడమేరు ఏఈ వెంకటేష్ అన్నారు.

## మహాచండి అవతారంలో శ్రీ మరిడమ్మ అమ్మవారు..



**పెద్దాపురం,అక్టోబరు 7 (వార్తాప్రభ) :** దేవదాయ – ధర్మదాయశాఖ ఆధ్వర్యంలోని పెద్దాపురం శ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానంలో దశమి శరన్నవరాత్రులు సందర్భముగా శ్రీ మహా చండీ అమ్మవారి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. సోమవారం ఉదయం ఉమాపార్థీవేశ్వరునికి రుద్రాభిషేకము,తదుపరి అమ్మవారికి పంచామృత అభిషేకం,కుంకుమపూజ జరిగినది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదములు అందజేయడం జరిగినదని సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారిణి విజయలక్ష్మి తెలిపారు.

## కనపర్తి విమల పెద్దకర్మ కార్యక్రమంలో కూటమి ప్రముఖులు....



**గూడూరు, అక్టోబరు 7 (వార్తాప్రభ) :** గూడూరు మండలం శారదాపేట గ్రామంలో కనపర్తి విమల పెద్దకర్మ లో టిడిపి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వీరిలో మాజీ డిప్యూటీ స్పీకర్ టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బూరగడ్డ వేదవ్యాస్, పెడన జడ్పిటిసి అర్జా నగేష్, టిడిపి మండల అధ్యక్షుడు చలపతి ప్రసాద్, సీరం ప్రసాద్, కాకర్లమూడి సర్పంచ్ కామేశ్వరరావు తదితర కూటమి నాయకులు ప్రముఖులు కనపర్తి విమల చిత్రపటానికి నివాళులర్పించారు...

## మైలవరంలో అక్రమ మద్యం పట్టివేత

● ఒక వ్యక్తి నుంచి 120 టిజి మద్యం బాటిళ్ల ను స్వాధీనం చేసుకున్న ఎస్ఐ



**మైలవరం,అక్టోబరు 7 (వార్తాప్రభ) :** మైలవరం పట్టణంలోని రహదారి పక్కన చెట్టుకింద సోమవారం మైలవరం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తెలంగాణ రాష్ట్రానికి చెందిన మద్యం బాటిల్స్ పెట్టుకొని ఉండగా అతనిని అదుపులోకి తీసుకొని మద్యం సీసాలు స్వాధీనం పరుచుకున్నట్లు ఎస్ఐ కె.సుధాకర్ తెలియజేశారు.ఆ వ్యక్తిని విచారించగా మైలవరం మండలం మొ రుసుమిల్లి గ్రామ సమీపంలోని తెలంగాణ బోర్డర్లో ఉన్న వైన్ షాప్ నుంచి అక్రమంగా మద్యం బాటిళ్ళు తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు గుర్తించా మని ఎస్ఐ తెలిపారు.మొత్తం 120 మద్యం సీసాలు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.అయితే పట్టుబడిన వ్యక్తి పేరు, వివరాలు పోలీసులు వెల్లడిం చలేదు. ఎవరైనా తెలంగాణ రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం రవాణా చేస్తే వారి పై చట్టప్రకారం కఠిన చర్యలు తీసు కుంటా మని ఎస్ఐ సుధాకర్ హెచ్చరించారు.

## ప్రజా ప్రతినిధులకు శిక్షణా తరగతులు




**ఆగిరిపల్లి, అక్టోబరు 7 (వార్తాప్రభ) :** ప్రజా ప్రతినిధులకు రెండు రోజులపాటు శిక్షణాతరగతులు నిర్వహిస్తున్నట్లు ఎండిఓ బి. భార్గవి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల ఉప సర్పంచ్లు, ప్రతి పంచాయతీ నుండి ఇద్దరు వార్డు నెంబర్లు హాజరు కావాల్సిందిగా కోరారు. బుధ మరియు గురువారాలలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఈ శిక్షణా తరగతులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతాయన్నారు. కావున ప్రతి పంచాయతీ నుంచి ముగ్గురు సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎండిఓ భార్గవి కోరారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థి ని భారీ మెజారిటీతో గెలిపించాలి - ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ,అక్టోబరు 7 (వార్తాప్రభ) :** రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి బలపరిచిన టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ని గెలిపించేందుకు నియోజకవర్గంలోనీ శ్రేణులు అందరూ కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కోరారు. సోమవారం స్థానిక కాకాని నగర్ కార్యాలయంలో ఉమ్మడి కృష్ణ - గుంటూరు గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజా ను విజయాన్ని కాంక్షిస్తు నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు,ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు నియోజకవర్గ ముఖ్య నేతలతో పట్టణ పోలింగ్ బూత్ ఇన్చార్జిలతో కలిసి ఎంఎల్ఏ సౌమ్య సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, ఆలపాటి రాజా మంత్రిగా, ఎమ్మెల్యేగా పార్టీకి ఎనలేని సేవలందించారని ఎంతో సౌమ్యమైన వ్యక్తి అని తెలిపారు. పట్టభద్రుల ఓట్ల దరఖాస్తులను షెడ్యూల్లోగా అధికంగా చేర్పించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ఇచ్చిన సూపర్ -6 పథకాలను అమలు చేసి తీరుతుందని ఇప్పటికే పెన్షన్ను రూ.1000 పెంచి అందించడం జరిగిందని, అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారని, నిరుద్యోగులకు డీఎస్సీ నోటిఫికేషన్ అందించడంతోపాటు మహిళలకు దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు క్లస్టర్ యూనిట్ ఇన్చార్జిలు నందిగామ పట్టణ పోలింగ్ బూత్ ఇన్చార్జిలు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సత్యమ్మ తల్లికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే వసంత



**నందిగామ,అక్టోబరు 7 (వార్తాప్రభ) :** మండలంలోని అంబారుపేట గ్రామంలో వేంచేసియున్న శ్రీ సత్యమ్మతల్లి అమ్మవారికి మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు ఆయన సతీమణి శిరీష సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకొని ప్రతి ఏడాది అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది.ఆలయ సంప్రదాయం ప్రకారం శాసనసభ్యులు కృష్ణప్రసాద్ దంపతులను కమిటీ సభ్యులు ఆహ్వానించారు. కృష్ణ ప్రసాద్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని, వేదపండితుల శాస్త్రోక్త మంత్రోచ్చారణల మధ్య పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు ఆకాంక్షించారు. కన్నులపండువగా జరిగిన ఈ పూజా కార్యక్రమంలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు

### – జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అక్టోబర్



**మంచిర్యాల, అక్టోబర్ 7 (వార్తాప్రభ ప్రతినిధి)**: ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాలను భవన సమావేశ మందిరంలో మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు రాములు, హరికృష? లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. తెలంగాణ ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ అన్ఎంప్లాయిడ్ అసోసియేషన్ ప్రతినిధులు తమ దరఖాస్తులో జాబ్ క్యాలెండర్ ద్వారా నిర్వహించబోయే డి.ఎస్.సి. లో ఖాళీగా ఉన్న ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఆప్ జిల్లా అధ్యక్షులు నల్ల నాగేంద్ర ప్రసాద్ తన దరఖాస్తులో నస్పూర్ లో గల తోళ్లవాగును ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించి పరిసర ప్రాంతాల ప్రజలను వరద ముప్పు నుండి రక్షించాలని కోరారు. బెల్లంపల్లి పట్టణం 2వ వార్డు గ్రౌండ్ బస్తివాసులు తమ బస్తీలో ఒక వ్యక్తి దారి ఆక్రమించుకొని బోర్ ఏర్పాటు చేసి, వాటర్ సంపు నిర్మించుకుని నడిచేందుకు ఇబ్బందులు కలిగిస్తున్నారని, ఈ విషయము తమకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మందమర్రి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్. ఎం. పనిచేసిన బొలిశెట్టి వేణు 2023–24 ఒకేషనల్ సెలెక్షన్ మొదటి పోస్టులు జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. క్యాతనపల్లి మున్సిపాలిటీకి చెందిన మేరుగు గట్టయ్య తాను క్యాతనపల్లి శివారులో కొనుగోలు చేసిన భూమికి పట్టా పాస్ పుస్తకం ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి మండలం మాల గురజాల గ్రామానికి చెందిన దుర్గం సుధీర్ తాను ధరణి పోర్టల్ లో పట్టా భూమిగా అని సవరించాలని ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకున్నానని, పరిశీలించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. దండేపల్లి మండలం వెల్గనూరు గ్రామానికి చెందిన కుటికెల అశోక్ తాను వాటర్ మెన్, ఇంటి బిల్లులు వసూలు పని చేస్తున్నానని, తనకు అదనపు కరెంటు పని అప్పగించడంతో తన విధులు సక్రమంగా నిర్వహించలేకపోతున్నానని, తన విధులు చేసుకునేలా అవకాశం ఇవ్వాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 30 దరఖాస్తులు అందాయని, దరఖాస్తులను అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏమీ ఉండదు....

### పట్టణ ఎస్ఐ విజయలక్ష్మి

### 4 వార్డ్ లో అంబరాణి అంటిన బతుకమ్మ సంబరాలు....




**భద్రాద్రి కొత్తగూడెం అక్టోబర్ 7 (వార్తాప్రభ ప్రతినిధి)** మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదని మహిళలు అన్ని రంగాలలో ముందుకు సాగాలని భద్రాచల పట్టణ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ విజయలక్ష్మి, సూర్య హాస్పిటల్ డాక్టర్ గీతా పావని అన్నారు. నాల్గవ వార్డు గొల్ల బజార్ లో జరిగిన బతుకమ్మ సంబరాలలో పాల్గొని వారు ప్రసంగించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆటపాటలతో హోరెత్తించారు. నాల్గవ వార్డు అభివృద్ధి కమిటీ, ఐద్వా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ వార్డు మెంబర్ బండారు శరత్ బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి డాక్టర్ గీతా పావని మాట్లాడుతూ మహిళలు ఇంత పెద్ద సంఖ్యలో ఎంతో సంతోషంగా ఉల్లాసంగా పాల్గొనడం అభినందనీయ మని అన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలని కోరారు. ఆడపిల్లలు చదువుకి మొదటి ప్రాధాన్యత ఇచ్చి జీవితంలో తమ కాల పై తాము నిలబడాలని అన్నారు. మహిళల రక్షణకు ప్రభుత్వాలు అనేక చట్టాలు రూపొందిస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకొని మహిళలు స్వేఛగా జీవించాలని కోరారు. అనంతరం బతుకమ్మ ఉత్సవాలలో భాగంగా బాగా పేర్చిన వారికి మొదటి రెండవ మూడవ బహుమతుల తో పాటు బతుకమ్మ ఉత్సవంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రతి ఒక్కరికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్జీలు గా పి సునీత, డి ప్రసన్నలు వ్యవహరించారు. ఐద్వా నాయకులు డి సీతాలక్ష్మి, నాదెళ్ల లీలావతి, మచ్చ రమాదేవి ఏ జై గౌతమి,బెల్లంకొండ కుసుమ,వై పూర్ణి, వార్డు మహిళలు బండారు సరస్వతి, జి పద్మావతి,స్వరూప, తయారు, రమా,శ్యామల తదితరులు పాల్గొన్నారు.

## మదర్ డైరీ ఛైర్మన్ ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి

**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో అక్టోబర్7(వార్తాప్రభ)** వెంకటరెడ్డి,ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హైదరాబాద్ హయత్ నగర్ నల్లగొండ–రంగారెడ్డి మదర్ డెయిరీ చైర్మన్ గా గుడిపాటి మధుసూదన్ రెడ్డి ,డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేసి పదవి బాధ్యతలు చేపట్టారు..ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రోడ్లుభవనాల సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల ఐలయ్య హాజరయ్యారు.. మధుసూదన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు.




# బిజెపి సభ్యత్వంతో వికసిత్ భారత్!!

■ సభ్యత్వంపై ఎక్కువ మక్కువ చూపుతున్న యువత ■ పల్లెల్లో, పట్టణాల్లో మోడీ నాయకత్వంపై పెరుగుతున్న విశ్వాసం ■ రామగుండం నియోజకవర్గం బిజెపి పార్టీ ఇంచార్జ్ కందుల సంధ్యారాణి



**పెద్దపల్లి/ గోదావరిఖని: అక్టోబర్ 7 (వార్తాప్రభ ప్రతినిధి )**బిజెపి సభ్యత్వంతో వికసిత్ భారత్ నిర్మాణం జరగనున్నట్లు సంతోషం వ్యక్తం చేశారు రామగుండం నియోజకవర్గం బిజెపి పార్టీ ఇంచార్జ్ కందుల సంధ్యారాణి. ఈ మేరకు సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో ఘనంగా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంధ్యారాణి హాజరై మాట్లాడారు. సభ్యత్వంపై ఎక్కువగా యువత మక్కువ చూపెడుతుండడం హర్షించదగిన విషయమని అన్నారు. పల్లెల్లో, పట్టణాల్లో మోడీ నాయకత్వంపై విశ్వాసం పెరుగుతున్నది అని అందుకు నిదర్శనం బ్రహ్మాండంగా కొనసాగుతున్న బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమాలు అని కొనియాడారు.

# "గాలింగ్" పోస్టులపై పోలీసు చర్యలకు రంగం సిద్ధం!!

■ సోషల్ మీడియా వేదికగా వ్యక్తిగతంగా కించపరిచే కామెంట్ల లిస్ట్ తయారు
■ ఎన్జీవోగా చలామణి అవుతూ ఇతర సంస్థలపై తప్పుడు ప్రచారం
■ చెప్పింది చెప్పినట్టు చేస్తున్న రామగుండం పోలీస్ బాసుపై ప్రశంసల జల్లు




**పెద్దపల్లి/ రామగుండం: అక్టోబర్ 7 (వార్తాప్రభ ప్రతినిధి )**"గాలింగ్"( వేధించే, కించపరిచే, రెచ్చగొట్టే) పోస్టులపై పోలీసు చర్యలకు రంగం సిద్ధం అయినట్లు విశ్వసనీయ సమాచారం తెలియవస్తున్నది. సోషల్ మీడియా వేదికగా వ్యక్తిగతంగా కించపరిచే కామెంట్ల లిస్ట్ పోలీస్ శాఖలోని ఒక ప్రత్యేక విభాగం ( సోషల్ మీడియా ట్రాకింగ్ సెంటర్) తయారు చేసినట్లు వినికిడి. ఇందులో ఎన్జీవోగా చలమణి అవుతూ ఇతర సంస్థలపై తప్పుడు ప్రచారం చేస్తున్న ఒక ఎన్జీవోపై కఠిన చర్య నమోదుకు అంతా సిద్ధమే... ఇక కేసులు మాత్రమే నమోదు అనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గోదావరిఖని ప్రాంతానికి చెందిన సదరు వ్యక్తిపై ఫిర్యాదుల పరంపర కొనసాగుతున్నట్లు రహస్యం బయటకు పొక్కినది. ప్రపంచంలో సత్య హరిచంద్రుడి తర్వాత తాను మాత్రమే అంతటి గొప్పవాడిలా ఫీలవుతూ ఇతరులను చులకన భావంతో చూసే సదరు వ్యక్తిపై కొందరు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సాఫ్ట్ కాపీల ద్వారా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. గతంలో, ఇటీవల ప్రకటన ఇచ్చి సోషల్ మీడియా యూజర్స్ బి కేర్ఫుల్ అని హెచ్చరించి చెప్పింది చెప్పినట్టు చేస్తున్న రామగుండం పోలీస్ బాసుపై ప్రశంసల జల్లు కురుస్తుండడం కొసమెరుపు.

# కార్మికుల హృదయ స్పందన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్!!

■ సింగరేణి చరిత్రలో అత్యధిక లాభాల వాటా కార్మికుల కోసం ■ కాంట్రాక్ట్ కార్మికుల కోసం ఐదు వేల రూపాయల బోనస్ ■ దుర్గా దేవి ఆశీస్సులతో అభివృద్ధి పథంలో రామగుండం ■ రామగుండం మహిళా కాంగ్రెస్ లీడర్ మనాలి రాజ్ ఠాకూర్



**పెద్దపల్లి/ గోదావరిఖని: అక్టోబర్ 7 (వార్తాప్రభ ప్రతినిధి )**కార్మికుల హృదయ స్పందన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అని కొనియాడారు రామగుండం మహిళా కాంగ్రెస్ లీడర్ మనాలి రాజ్ ఠాకూర్. ఈ మేరకు సోమవారం సింగరేణి రామగుండం రీజియన్ వన్ పరిధిలోని ఓసిపి ఫైవ్ గనిపై జరిగిన దుర్గా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో పాల్గొని బోనం నెత్తిన ఎత్తుకొని అమ్మవారికి మొక్కులు సమర్పించారు మనాలి. ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి



తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..... సింగరేణి చరిత్రలో అత్యధిక లాభాల వాటా కార్మికుల కోసం ప్రకటించి నేడు చెక్కులు పంపిణీ చేయడం శుభ పరిణామం అని అన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల కోసం ఐదు వేల రూపాయల బోనస్ ఇవ్వాలని నిర్ణయించడం కాంగ్రెస్ ప్రభుత్వంకు కార్మికులపై ఉన్న చిత్తశుద్ధికి తార్కానమని అన్నారు. దుర్గా దేవి ఆశీస్సులతో అభివృద్ధి పథంలో రామగుండం అని తెలిపారు. దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలలో ఓపెన్ కాస్ట్ 5 ప్రాజెక్టు మేనేజర్, ఉన్నత అధికారులు, కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి, జనగామ శ్రీనివాస్ గౌడ్, ఉల్లంగుల రమేష్, తిప్పారపు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## బాలానగర్ నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన నర్సింహా రాజు



**కూకట్ పల్లి,అక్టోబర్7(వార్తాప్రభ):**బాలానగర్ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా టి. నరసింహ రాజు సోమవారం బాధ్యతలు చెప్పటారు. గతంలో పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ లో డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ గా పని చేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ సీఐగా ఉన్న నవీన్ కుమార్ రాజేందర్ నగర్ పోలీస్ స్టేషన్ కు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సీఐ నరసింహ రాజు మాట్లాడుతూ స్థానికులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బాలానగర్ పోలీస్ స్టేషన్ పరదిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగితే ఉపేక్షించేది లేదన్నారు.అదేవిధంగా అవాంఛనీయ సంఘటనలు గాని అసాంఘిక కార్యకలాపాలు ఎక్కడైనా జరిగితే మా దృష్టికి తీసుకొని రావాలని వారు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం దిశగా ముందుకు వెళ్తామన్నారు. బాలానగర్ పరదిలో పరిధిలోని ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.

## సద్దుల బతుకమ్మ పండుగ ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎమ్మెల్యే కృష్ణారావు

**కూకట్ పల్లి,అక్టోబర్7(వార్తాప్రభ):**కూకట్ పల్లి నియోజకవర్గం బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని రంఘధాముని చెరువు వద్ద ఎక్కడ లేని విధంగా, పెద్ద ఎత్తున ఘనంగా ఈ నెల 10వ తేదిన జరిగే సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా జిహెచ్ఎంసి మరియు పోలీసు శాఖల అధికారులతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్థానిక కార్పొరేటర్ శిరీష బాబురావుతో కలిసి ఏర్పట్లపైన సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులతో మాట్లాడి దిశ నిర్దేశించారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ కార్పొరేటర్ రవీందర్, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్, జిహెచ్ఎంసి అధికారులు డిసి రమేష్, ఈఈ శ్రీనివాస్,డిఈ శ్రీదేవి, ట్రాఫిక్ సిఐ ముత్తు యాదవ్, పోలీసు ఇన్స్పెక్టర్ రామకృష్ణ , ఎలక్ట్రికల్ డిఈ స్వప్న, జలమండలి జిఎం ప్రభాకర్ , శంషీర్,శిరీష ,సలోని,శానిటేషన్ సూపర్వైజర్ డా.కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.



వార్తా ప్రభ
హైదరాబాద్

## అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సంతోషంగా ఉండాలి- శాసనసభ్యులు అరికెపూడి గాంధీ




**శేరిలింగంపల్లి,అక్టోబర్ 7 (వార్తాప్రభ):**మియాపూర్ డివిజన్ పరిధిలోని మియాపూర్ గ్రామంలో దసరా పర్వదినం సందర్భంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 5వ రోజు శ్రీ మహచండీ దేవి అవతారంలో కొలువుదీరిన అమ్మవారికి కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ..అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో,శాంతి సౌభాగ్యలతో జీవించాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రాంచందర్,మోహన్ ముదిరాజు ,గంగాధర్,ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్,బాలింగ్ గౌతమ్ గౌడ్,నాగుల్ గౌడ్,మహేందర్ ముదిరాజు,ఇబ్రహీం,కాలనీ వాసులు,భక్తులు పాల్గొన్నారు.

## వైభవోపేతంగా సారీస్ ఆఫ్ ఇండియా బతుకమ్మ మరియు దసరా ఉత్సవాలు

**శేరిలింగంపల్లి,అక్టోబర్ 7 (వార్తాప్రభ):**మాదాపూర్ లోని శిల్పారామం లో సారీస్ అఫ్ ఇండియా బతుకమ్మ మరియు దసరా ఉత్సవాలు ఎంతగో సందడిగా సాగుతున్నాయి. శిల్పారామం మహిళా సిబ్బంది బతుకమ్మ ను పేర్చి సందర్శకులతో కాళీ ఆడుకుంటున్నారు. సోమవారం





సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా కూచిపూడి మరియు కథక్ నృత్య ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. లక్ష్మి శంకర్ శిష్య బృందం వినాయక కౌతం, పార్వతి నందనం, రామాయణ శబ్దం, నమఃశివాయతేయ్, వందే మీనాక్షి,వసంత తిల్లాన అంశాలను వాణి,వెంక సృష్టి , సాహితీ,పండు,అమృత వర్షిణి,అవంతిక,కీర్తన, శ్రీవల్లీ, యాషిక,మనస్విని మొదలైన వారు ప్రదర్శించారు. అర్చన మిశ్ర శిష్య బృందం కథక్ నృత్య ప్రదర్శనలో గురు వందన,రాస్ రచత,మధురాష్టకం,నృత్య సంగీత్,యమన్ తరాన మొదలైన అంశాలను లక్షిత,ఆకాంక్ష, సర్వాణి,ఇషీ,దేవంశీ,శ్రీకా,ఆన్వీ,అన్విత మొదలైన వారు ప్రదర్శించారు.

## నాలాపై బ్రిడ్జిని నిర్మించాలంటూ కాంగ్రెస్ నేత బండి రమేష్ కు వినతి పత్రం అందజేత



**కూకట్ పల్లి,అక్టోబర్7 (వార్తాప్రభ)**కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని బాలానగర్ డివిజన్ పరిధిలోని కళ్యాణ్ నగర్ నుంచి నవజీవన్ నగర్ కు నాలాపై బ్రిడ్జి నిర్మించాల్సిందిగా కోరుతూ కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ కి సోమవారం బాలనగర్ లోని పార్టీ కార్యాలయంలో స్థానిక నాయకులు బస్తివాసులు వినతి పత్రం అందజేశారు. స్థానికంగా నాలాపై బ్రిడ్జి నిర్మిస్తే స్థానికులకు రాకపోకలు సాగించేందుకు వీలు ఉంటుందని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు లక్ష్మయ్య, రామ్మోహన్,పులి శ్రీకాంత్,పులి శివ,తదితరులు పాల్గొన్నారు.

## భాగ్యరధి జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు...

**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 7 (వార్తాప్రభ)** : చింతల్ లోని భాగ్యరధి జూనియర్ కళాశాలలో ఐదవ రోజున బతుకమ్మ వేడుకను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి అలరించారు. ఆటపాటలతో సాంప్రదాయ వేషాధారణతో బతుకమ్మల చుట్టూ తిరుగుతూ గౌరీదేవిని పూజించారు. విద్యార్థులు బతుకమ్మలను నిమజ్జనం చేసి ఒకరినొకరు తాము తెచ్చుకున్న సద్దులను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు ఎన్. వెంకట్ రెడ్డి, సిహెచ్.గోవిందరెడ్డి, జి.రమేష్ బాబు, కె. రామకృష్ణ ,ఎన్.జై శంకర్ గౌడ్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



# ఎడిటోరియల్

## తిరుమలకు శాశ్వత డెయిరీ: చంద్రబాబుకు చక్కని ఛాన్స్..!

మంచో.. చెడో..తిరుమల శ్రీవారి పవిత్ర లడ్డూ ప్రసాదంలో వినియోగించే నెయ్యి కల్తీ అయిందన్న ఆరోపణలు వచ్చాయి. వీటిలో నిజానిజాలను నిగ్గు తేల్చేందుకు సుప్రీంకోర్టు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందం పని ప్రారంభించనుంది. అయితే.. ఇప్పుడు తిరుమలకు సంబంధించి సరికొత్త డిమాండ్ తెరమీదికి వచ్చింది. అదే.. తిరుమల శ్రీవారికి సొంతంగా ప్రత్యేక డెయిరీని ఏర్పాటు చేయాలని. దీనిని తొలుత బీసీవై పార్టీ నాయకుడు బోడే రామచంద్రయాదవ్ తెరమీదికి తెచ్చారు. తానే స్వయంగా 10 వేల గోవులు ఇస్తానని.. అదేసమయంలో దాతల నుంచి లక్ష గోవులను సేకరిస్తానని చెప్పారు. ఓ కుచేలుడు వీటిని తిరుమల ఆధ్వర్యంలో పెంచి..పోషించి.. పాలు తీసుకుని..తద్వారా వచ్చే నెయ్యిని శ్రీవారికైంకర్యాలకు వినియోగించాలన్నది బోడే సూచన. ఇది చక్కని ఆలోచనగా సోషల్ మీడియాలోనూ మార్కులు పడుతున్నాయి. మేధావులు కూడా ఇదే చెబుతున్నారు. శ్రీవారి ఆలయానికి రాష్ట్రంలోనే కాకుండా.. పొరుగు రాష్ట్రాల్లోనూ అనేక స్థలాలు ఉన్నాయి. అదేవిధంగా బ్యాంకుల్లోనూ వందల కోట్ల రూపాయల డిపాజిట్లు ఉన్నాయి. ఇక, భక్తులు రోజూ ఇచ్చే విరాళాలు.. నెలకు వివిధ బ్యాంకుల నుంచి డిపాజిట్లపై వచ్చే వడ్డీలు అన్నీ కలుపుకొంటే ఇవి కూడా వందలు, వేల కోట్ల రూపాయల్లోనే ఉన్నాయి.వీటి ద్వారా లక్ష గోవులను సమీకరించుకుని.. ప్రత్యేకంగా తిరుమల శ్రీవారికి డెయిరీ ఫాంను ఏర్పాటు చేస్తే.. తద్వారా.. పాలు పెరుగుతోపాటు నెయ్యిని కూడా తీసుకునేందుకు వెసులు బాటు ఉంటుంది. అయితే.. దీనికి చేయాల్సిన ఏకైక పనిరాష్ట్ర ప్రభు త్వం ఒక తీర్మానం చేసి.. మంత్రివర్గంలో ఆమోదించుకుని తిరుమలకు పంపడమే. ఈ పని కనుక చంద్రబాబు చేయగలిగితే.. తిరుమలకు శాశ్వతంగా ఒక ప్రత్యేక డెయిరీ ఏర్పాటు అవుతుంది. దీనిని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు మహా అయితే మూడు మాసాల సమయం పడుతుంది. అప్పటి వరకు కాంట్రాక్టులను కొనసాగించి.. తర్వాత.. తిరుమల డెయిరీతోనే సరుకులు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఎన్నెన్నో లాభాలు.. తిరుమల ప్రత్యేకంగా ఒక డెయిరీని ఏర్పాటు చేసుకుంటే.. లక్ష గోవుల ఆలనా పాలనా చూసేందుకు యాదవ సామాజిక వర్గానికి చెందిన యువతకు వేలాది మందికి ఉపాధి కల్పించవచ్చు. అదేవిధంగా మినీ డెయిరీలను ఏర్పాటు చేసుకుని తిరుమల అవసరాలకు పోగా మిగిలే పాలను విక్రయించుకోవచ్చు. అదేవిధంగా నిత్యం శ్రీవారి భక్తులకు క్యూలైన్లలో ఇచ్చే పాలు, పెరుగన్నం వంటివాటిని కూడా ఈ డెయిరీ నుంచి ఉత్పత్తి అయిన పాలు, పెరుగు నుంచి ఇచ్చే సౌలభ్యం ఏర్పడుతుంది. పైగా నెయ్యి అసలు కల్తీ అనే మాటే లేకుండా.. మరింత స్వచ్ఛమైన నెయ్యిని వినియోగించుకునే అవకాశం సొంతగానే ఏర్పడుతుంది. దీనికి సహకరించేందుకు దాతలు, మఠాలు, పీఠాలు కూడా ముందుకు వస్తాయి. పైగా.. చంద్రబాబు హయాంలో శాశ్వత డెయిరీని ఏర్పాటు చేశారన్న పేరు చిరస్థాయిగా ఉండిపోతుంది. కాబట్టి.. ఆదిశగా చంద్రబాబు అడుగులు వేస్తే.. పేరుకు పేరు, నాణ్యతకు నాణ్యత, ఉపాధికి ఉపాధి అన్నీ లభిస్తాయని అంటున్నారు పరిశీలకులు.

## శ్రేష్టమైన స్నేహము



సృష్టిలోన స్నేహము
మానవునికి భాగ్యము
చెప్పుడు మాటలు విని
చేసుకోకు దూరము
చెలిమి కలిమి మధురము
అది పవిత్ర బంధము
బ్రతుకున నిలుపుకొనిన
చేకూర్చును క్షేమము
ప్రాణ సమము స్నేహము
ఖరీదైన హేమము
అపకార బుద్ధితో
చేయబోకు హేయము
స్నేహానికి న్యాయము
చేసినచో ధర్మము
జీవితాన ఎన్నడు
చేయరాదు మోసము
స్నేహమే శాశ్వతము
ఉన్నచో జీవితము
అక్షరాల సాక్షిగా
ఇదే నా అభిమతము
దండలోని దారము
బంధాలకాధారము
ధాత్రిలోన స్నేహము
చేర్చు విజయ తీరము

**-గద్వాల సోమన్న**
9966414580

## విజ్ఞత, విధేయత కలిగిన ఆకుపాటి వెంకటేష్ టిడిపిలోని యువతకు ఆదర్శం

### ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి



**కనిగిరి అక్టోబర్ 7 వార్త ప్రభ ప్రతినిధి** కనిగిరి నియోజకవర్గం పామూరు ఎంపీటీసీ సభ్యులు ఆకుపాటి వెంకటేష్ ను పామూరు పట్టణంలోని టిడిపి కార్యాలయంలో కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి దుశ్శాలవతో సత్కరించారు. ప్రకాశం జిల్లా ఎంపీటీసీ సభ్యుల సంఘం అధ్యక్షునిగా ఎన్నికైనందున అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ టిడిపిలో యువతకు ప్రత్యేక ప్రాధాన్యం, ప్రాముఖ్యత ఇవ్వడం జరుగుతుందని, ఎంపీటీసీల అభ్యున్నతికి, వారి పరిధిలోని గ్రామాలలో సమస్యల పరిష్కారానికి ఆకుపాటి వెంకటేష్ కృషి చేయాలని, వెంకటేష్ నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, దేవరపు మాల్యాద్రి, ఉప్పలపాటి హరిబాబు, షేక్ మోబినా మౌలాలి, నరసింగు సాంబశివరావు, షేక్ ఖాజా రహంతుల్లా, నీరు కట్టు నాయబ్ రసూల్, ఆర్ ఆర్ రఫీ, బండ్ల నారాయణ, పందిటి హరీష్, టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# దాతలు ఆదుకోవాలని వినతి



**జగ్గయ్యపేట అక్టోబర్ 7 (వార్తా ప్రభ)** పట్టణంలోని ఆర్టీసీ కాలని లో ఇటీవల వరదల కారణంగా ఒక కాలు పూర్తిగా తొలగించి రెండవ కాలుకు ఇన్ఫెక్షన్స్ సోకి హాస్పటల్లో వైద్యం చేయించుకుంటున్న కొత్తా బవదిప్ (12)బాలుడి కుటుంబ సభ్యులు ని ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని బాలుడు తండ్రి కోరుతున్నారు. బాలుడు తండ్రి కొత్తా నాగరాజు మాట్లాడుతూ ఇటీవల వచ్చిన వరదలు తమ కుటుంబాన్ని ఆర్థికంగా,మానసికంగా దెబ్బతీసాయని అన్నారు. అయితే మీడియా సహకారంతో స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య కృషితో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో బాలుడికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి పది లక్షలు 24 గంటల్లో మంజూరు చేశారని. ఇంకా ఎంత అవసరమైతే అంతా ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి అందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని అన్నారు. అయితే హాస్పటల్లో కొన్ని రకాల టెస్టులకు, ఇతర ఖర్చులకు తమ ఆర్థిక పరిస్థితి సహకరించడం లేదని.ఇంకా రెండు నెలల పాటు హాస్పిటల్లోనే ఉండాల్సిన పరిస్థితి ఉందని.మానవత్వం కలిగిన అనేక రకాలైన ఫౌండేషన్లు, దాతలు ఉన్నారని అందరూ పెద్ద మనసుతో తమ కుటుంబానికి ఆర్థికంగా సహాయం చేయాలని కోరారు. ఫోన్ పే 9912788516 లేదా 7075915789. కొత్త నాగరాజు అకౌంట్ నెంబర్ 50100329594666 ఐఎఫ్ఎస్సి కోడ్ హెడిఎఫ్సి 0002367 కి ఆర్థిక సహాయాన్ని అందించాలని ఆయన కోరారు.

# ఆగిన ఉపాధి హామీ పనులుపై ఆగ్రహం

### ఉపాధి పనులు వెంటనే ప్రారంభించాలి- టిడిపి అధ్యక్షులు రావి లక్ష్మీనర్సారెడ్డి



**చేజర్ల అక్టోబర్ 07 (వార్తాప్రభ)** మండలంలోని చేజర్ల గ్రామ పంచాయతీలో చేజర్ల మజరా గ్రామమైన చేజర్ల కండ్రిక లో 45 రోజుల నుండి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు జరగడం లేదని అలాగే చేజర్లలో రెండు వారాల నుండి ఉపాధి హామీ పనులు జరగడం లేదంటూ కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారంటూ చేజర్ల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చేజర్ల గ్రామ మాజీ సర్పంచి రావి లక్ష్మీనరసారెడ్డి ఈ విషయంపై పాత్రికేయులతో సోమవారం మాట్లాడారు.ఆయన మాట్లాడుతూ సుమారు నెలరోజుల పైగా ఉపాధి పనులు జరగకపోవడం వలన కూలీలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.ఈ విషయంపై సదరు అధికారులకు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అడగడం జరిగిందని తెలిపారు.అయితే మండల పరిషత్ అభివృద్ధి అధికారి విజయ లలితను అడగగా ఆమె సమాధానం ఇవ్వలేదని పేర్కొన్నారు.ఏపీఓ వెంకటేశ్వర్లును అడిగితే గ్రామాలలో తీర్మానాలు లేవు అందుకే పనులు పెట్టలేదని కుంటిసాకు చూపాడని మండిపడ్డారు.ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేస్తామని అలాగే రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి మరియు ఆత్మకూరు శాసన సభ్యులు ఆనం రామనారాయణ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కూలీలకు పనులు కల్పించే విధంగా చూస్తామ న్నారు.అవసరమైతే మంత్రి నారా లోకేష్ మరియు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి కూడా తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.ఉపాధి హామీ పనుల జరగకపోవడం వలన కూలీలు నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తూ పాత్రికేయులతో మాట్లాడారు.



**ఏపిఓ వెంకటేశ్వర్లు వివరణ** :మండలంలోని పలు గ్రామాలలో ఉపాధి హామీ పనులు జరగక పోవడానికి ఆయా గ్రామ పంచాయతీల తీర్మానాలు లేనందున పనులు జరగలేదని అలాగే తీర్మానాలు పంపించాలని ఆయా గ్రామాలకు తెలియజేశామని చేజర్ల గ్రామంలో చేజర్ల కండ్రికలో పంచాయతీ తీర్మానాలు వచ్చిన వెంటనే ఉపాధి హామీ పనులు ప్రారంభిస్తామని చాలా గ్రామాల్లో పనులు వర్క్ ఐడీలకు సంబంధించి తీర్మానాలు రావలసి ఉన్నాయంటూ చేజర్ల మండల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ఏపీవో వెంకటేశ్వర్లు వివరణ ఇచ్చారు.

# చిట్టినగర్ అమ్మవారిని దర్శించుకున్న ఆకుల శ్రీనివాస్

### ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన పాలక వర్గం



**విజయవాడ పశ్చిమ, అక్టోబర్ 7: (వార్తా ప్రభ ప్రతినిధి)**దసరా మహోత్సవంలో భాగంగా చిట్టినగర్ శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో సోమవారం శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అలంకారంతో దర్శనమిచ్చిన అమ్మవారిని ప్రముఖ పారిశ్రామికవేత్త , సీనియర్ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం పాలకమండలి అధ్యక్షులు లింగిపిల్లి అప్పారావు, కార్యదర్శి మరూపిళ్ళ హనుమంతరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. అనంతరం శాలువతో సత్కరించి ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ చిట్టినగర్ శ్రీ మహాలక్ష్మి అమ్మవారు ఆలయంలో దసరా మహోత్సవాలు అత్యంత వైభవంగా పాలకవర్గం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ప్రజానీకాన్ని అమ్మవారు చల్లగా చూడాలని ప్రార్థించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆకుల శ్రీనివాస్ కుమారుడు డాక్టర్ రాజ్ కుమార్, ఆలయ పాలకమండలి ప్రముఖులు బెవర శ్రీనివాసరావు, పొట్నూరి దుర్గాప్రసాద్, లింగిపిల్లి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి గా దర్శనమిచ్చిన చిట్టినగర్ అమ్మవారు

**విజయవాడ పశ్చిమ, అక్టోబర్ 7 : (వార్తా ప్రభ ప్రతినిధి)**స్థానిక చిట్టినగర్ లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న దసరా మహోత్సవంలో భాగంగా సోమవారం అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ప్రముఖ పారిశ్రామికవేత్త, సీనియర్ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్, ఆయన కుమారుడు డాక్టర్ రాజ్ కుమార్ దర్శించుకుని పూజలు చేశారు. అలాగే శ్రీశైలం లోని నగరాల నిత్యాన్నదాన వసతి సత్రం ఫౌండర్ సెక్రెటరీ కొరగంజి జగన్ అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే ఆర్టీసీ ఎండి సిసి బాలస్వామి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. కాగా ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అలంకారంతో దర్శనమిచ్చిన శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని పూజాదికాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మీ అమ్మవార్ల దేవస్థానం కమిటీ అధ్యక్షులు లింగిపిల్లి అప్పారావు, కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, గౌరవాధ్యక్షులు బెవర సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రతినిత్యం వేలాది మంది భక్తులు ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుంటున్నారని చెప్పారు. అలాగే దసరా సందర్భంగా ప్రతిరోజు సాయంత్రం వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని , ఆయా కార్యక్రమాలకు భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తుందని చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న వారికి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ ఉపాధ్యక్షులు బెవర శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులు పొట్నూరి దుర్గాప్రసాద్ (రాజా), శీరం వెంకట్రావు, కార్యవర్గ సభ్యులు మజ్జి ఈశ్వరరావు, తొత్తడి భరత్ కుమార్ , పోతిన సాంబశివరావు, భోగవల్లి శ్రీధర్ , ముదిలి గణేష్, బంక హనుమంతరావు, ఈది ఎల్లా రాజారావు, పిళ్లా విజయ్ కుమార్, మజ్జి శ్రీనివాసరావు పోతిన వెంకట ధర్మారావు, గూడేల రామకృష్ణ, కామందుల నరసింహారావు, తమ్మిన సూర్యకుమారి, పనుకు రమ,తదితరులు పాల్గొన్నారు.





# సంక్షేమ హాస్టల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలి-కలెక్టర్ డీకే బాలాజీ!!!

**మచిలీపట్నం అక్టోబర్ 7 (వార్తా ప్రభ ప్రతినిధి)**జిల్లాలో ప్రభుత్వ



ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన వైద్య పరీక్షల పరికరాలు సమకూర్చడంతో పాటు, వివిధ సంక్షేమ హాస్టల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ సోమవారం కలెక్టరేట్లో జిల్లా ఖనిజ నిధి (డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్) వినియోగంపై పంచాయతీరాజ్ , వైద్య ఆరోగ్య, విద్య, సంక్షేమ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి కలెక్టర్ సమీక్షించారు. జిల్లా ఖనిజ నిధుల నుండి గతంలో మంజూరైన పనులు వాటి పురోగతిపై కలెక్టర్ ఆరా తీశారు. పురోగతిలో ఉన్న పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. మంజూరైన పనుల్లో ఇంకా గ్రౌండింగ్ కానీ వాటిని, టెండర్లు పిలవని వాటిని క్యాన్సిల్ చేయుటకు, కొత్త పనులు చేపట్టుటకు ప్రతిపాదనలు పంపాలన్నారు. జిల్లా ఖనిజ నిధులతో తాగునీటి సరఫరా, ఆరోగ్య సంరక్షణ, విద్యా రంగాల్లో 55% నిధులు, రోడ్లు, వంతేనలకు 40 శాతం నిధులు వినియోగించాలనే నిబంధనలు కచ్చితంగా పాటించాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎక్విప్మెంట్ ఏర్పాటు, సంక్షేమ హాస్టల్స్ లో మౌలిక సదుపాయాల కల్పన, అంగన్వాడీ కేంద్రాల్లో ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు, ఆక్వా ల్యాబ్స్ బలోపేత చర్యలు, తదితర పనులకు సంబంధిత శాఖల అధికారులు వెంటనే ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. వీటిని గవర్నింగ్ సమావేశంలో ఆమోదించుటకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా గనుల శాఖ డిడి శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఎస్ఈ రమణారావు, డి ఎం అండ్ హెచ్ వో డాక్టర్ జి గీతాబాయి, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి షాహిద్ బాబు, డిసీహెచ్ఎస్ డాక్టర్ శ్రావణ్ కుమార్, జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి జి రమేష్, జిల్లా గిరిజన సంక్షేమ సాధికారతాధికారి ఫణి దూర్జటి, సిపిఓ గణేష్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు

# మినుము పంటలో విత్తన శుద్ధి తప్పనిసరి

### కృషి విజ్ఞాన కేంద్రం నెల్లూరు శాస్త్రవేత్త డాక్టర్ డి విజయ్ కుమార్ నాయక్



**చేజర్ల అక్టోబర్ 07 (వార్తాప్రభ)** క్షేత్ర ప్రదర్శనలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం నెల్లూరు శాస్త్రవేత్త డా. డి. విజయ్ కుమార్ నాయక్ చేజర్ల కలువాయి మండలాల్లోని వివిధ గ్రామాలలో వేస్తున్న మినుము పంటలో విత్తన శుద్ధి కార్యక్రమం చేపట్టారు.శాస్త్రవేత్త విజయ్ కుమార్ మాట్లాడుతూ గత రెండు రోజులలో కురిసిన వర్షాలకు రైతులు మినుము వేస్తున్నారని రైతులు తప్పనిసరిగా ఒక కేజీ విత్తనానికి 5 మి.లీ. ఇమిడా క్లోప్రిడ్ తో విత్తనశుద్ధి చేయడం వలన రసమంపీల్చే పురుగుల నుంచి పంటను 20-30 రోజుల వరకు కాపాడుకోవచ్చు అని తెలిపారు.అదేవిధంగా తెల్లదోమ తామర పురుగులు పేనుబంక ద్వారా వ్యాపించే వైరస్ తెగులు అయినటువంటి పల్లాకు తెగులు బొబ్బర తెగులు మరియు మొవ్వకుళ్ళ తెగులునుంచి కూడా పంటను కాపాడుకోవచ్చు అని తెలిపారు. రక్షణ పంటగా జొన్న లేదా సజ్జను 4-5 వరసలు పంట చుట్టూ వేసుకోవాలని సూచించారు. విత్తనం మొలకెత్తిన 15-20 రోజులకు పసుపు మరియు నీలంరంగు జిగురు అట్టలు 15 చొప్పున అమర్చుకోవాలని సూచించారు.ఈప్రాంతంలో ఎక్కువగా పియు37 విత్తనాలను వేస్తున్నారు గనుక రైతులు తప్పనిసరిగా సర్టిఫికేషన్ చేసిన విత్తనాలనే విత్తుకోవాలని సూచించారు.

# తహాశీల్దారు మస్తానయ్యను కలిసిన బిజెపి నేతలు



**చేజర్ల అక్టోబర్ 07 (వార్తాప్రభ)** ఇటీవల డిప్యూటీ తహశీల్దార్ గా నూతన బాధ్యతలు చేపట్టి ప్రస్తుతం ఇన్చార్జి తహశీల్దారుగా ఉన్న ఆర్.మస్తానయ్యను చేజర్ల మండల భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు భత్తల కృష్ణయ్య రాష్ట్ర కిసాన్ మోర్చ కార్యవర్గ సభ్యులు కుంకు బాలయ్య నాయుడు బిజెపి నాయకులు కోటిరెడ్డి సోమవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు.

# శ్రీ మహాచండి అవతారంలో దర్శనమిస్తున్న అమ్మవారు



**జగ్గయ్యపేట అక్టోబర్ 7 (వార్తా ప్రభ )** పట్టణంలో మార్కండేయ బజార్లో వేంచేసి ఉన్న దుర్గ నవరాత్రులు మండపం లో దుర్గా భవాని మాత ఐదవ రోజైన సోమవారం మహా చండీ అవతారం లో భక్తులకు దర్శన మిస్తున్నారు. సాయంత్రం ఐదు గంటల నుండి నగర సంకీర్తన కార్యక్రమం మండపం వద్ద నుండి ప్రారంభమై ప్రధాన వీధుల గుండా సాగుతుందని . జ్యోతులను పట్టుకునేవారు ఉదయం కంకణ ధారణ చేసుకోవాలని , ఉపవాసం ఉండాలని దుర్గ భవాని గురుస్వామి రంగుల శ్రీను తెలియజేశారు.

## రాష్ట్రంలో పలు దేవాలయాలనుండి బెజవాడ కనకదుర్గమ్మ కి సారె సమర్పణలు



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 7 :(వార్తా ప్రభ ప్రతినిధి)**దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్న ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో కొలువైయున్న జగన్మాతకు రాష్ట్రంలోని వివిధ దేవాలయాల నుంచి సారె సమర్పించడం ఒక సంప్రదాయం. ఇందులో భాగంగా సోమవారం తిరుపతి జిల్లాలోని శ్రీ కాళహస్తీశ్వర దేవస్థాన ప్రతినిధులు ఇంద్రకీలాద్రికి చేరుకొని అమ్మవారికి పట్టు వస్త్రాలు, సారె సమర్పించారు. శ్రీ మహా చండీ దేవి అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఈవో ఎస్.ఎస్.చంద్రశేఖర్ ఆజాద్ నేతృత్వంలోని అధికారులు, వేద పండితుల బృందం అమ్మవారికి పట్టు వస్త్రాలు, సారె సమర్పించారు. అనంతరం శ్రీ కాళహస్తీశ్వర దేవస్థాన ఈవో ఆజాద్ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ ఏటా దసరా శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి శ్రీ కాళహస్తీశ్వర దేవస్థానం తరపున పట్టు వస్త్రాలు, సారె సమర్పించడం సంప్రదాయంగా వస్తోందని అన్నారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది శ్రీ మహా చండీ దేవి అలంకృత అమ్మవారికి సారె సమర్పించడం జరిగిందని వివరించారు.

## మహా చండి దేవి కి ప్రత్యేక పూజలు




**విన్నన్నపేట అక్టోబర్ 7 (వార్తా ప్రభ ప్రతినిధి)**స్థానిక పద్మశాలి స్ట్రీట్ నందు పెండెం సోమయ్య చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పెండెం శ్రీనివాస్ మల్లయ్య ఆధ్వర్యంలో శ్రీ మహా చండీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి సమయంలో అన్న దాన వితరణ జరిపారు

## కొండపల్లి మున్సిపాలిటీ చైర్మెన్ ఎన్నిక నిర్వహించండి

■ ఏపీ ఎన్నికల కమిషన్ కు ఎమ్మెల్యే వసంత విజ్ఞప్తి



**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 07(వార్తా ప్రభ ప్రతినిధి):–** కొండపల్లి మున్సిపాలిటీకి చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు త్వరగా ఎన్నికలు నిర్వహించాలని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు సోమవారం విజ్ఞప్తి పత్రం సమర్పించారు. విజయవాడలోని ఏపీ స్టేట్ ఎలక్షన్ కమిషన్ కార్యాలయంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని ను ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ సోమవారం కౌన్సిలర్స్ తో కలిశారు. కొండపల్లి మున్సిపాలిటీకి చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల ప్రజలకు సత్వర సేవలను అందించడంలో కలుగుతున్న ఇబ్బందులను ఆమెకు వివరించారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించి సాధ్యమైనంత త్వరగా ఎన్నికలను నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టిడిపి చైర్మన్ అభ్యర్థి చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్మన్ అభ్యర్థి చుట్టుకుదురు శ్రీనివాస్, కౌన్సిలర్ చనుమోలు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ స్కాందా మాతా దేవి అలంకారంలో దర్శనమిచ్చిన శ్రీ దేవి కరుమారి అమ్మన్



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 7 :(వార్తా ప్రభ ప్రతినిధి)** దసరా శరన్నవరాత్రి మహోత్సవంలో భాగంగా సోమవారం శ్రీ దేవి కరుమారి అమ్మన్ శక్తి పీఠంలో భక్తులు పోటెత్తారు. విజయవాడ మిల్క్ ఫ్యాక్టరీ సమీపంలో ఉన్న సి వి ఆర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జీ పక్కన ఉన్న స్వయంభూ శ్రీ దేవీ కరుమారి అమ్మన్ శక్తి పీఠంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం భక్తులు పోటెత్తారు. అమ్మవారుస్కాందా దేవి రూపం లో దర్శనం ఇచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శక్తి పీఠం పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ కరుమారి (దాసు)స్వామి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వేడుకల్లో వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శక్తి పీఠం ప్రాంగణంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని కరుణ దాసు చేతులు మీదుగా ప్రారంభించారు.

## ఉరవకొండలో రోజురోజుకూ పెరుగుతున్నదొంగతనాలు



**ఉరవకొండ అక్టోబర్ 7 :(వార్తా ప్రభ ప్రతినిధి)**వరుస చోరీలతో ఉరవకొండ ప్రాంత ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. తాళం వేసిన కిరాణా దుకాణాలను టార్గెట్ గా చేసుకొని దొంగతనాలు చాకచక్యంగా చోరీలకు పాల్పడుతున్నారు. సోమవారం అర్ధరాత్రి జాతీయ రహదారి పక్కన ఉన్న చిల్లర కొట్టులో దొంగలు చోరీలకు పోల్పడ్డారు. ఇలా రోజురోజుకూ దొంగతనాలు పెరిగిపోతూనే ఉన్నాయని, అధికారులు వెంటనే స్పందించాలని స్థానికులు వాపోతున్నారు.

# లడ్డు ప్రసాదం నాణ్యత విషయంలో రాజీ పడేది లేదు

■ అత్యంత నాణ్యత ప్రమాణాలతో లడ్డు ప్రసాదం తయారీ ■ మూలా నక్షత్రం రోజు కోసం రెండున్నర లక్షల లడ్డూలు సిద్ధం ■ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 7 :(వార్తా ప్రభ ప్రతినిధి)**లడ్డు ప్రసాదం నాణ్యత విషయంలో రాజీ పడేది లేదని.. అత్యంత నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ అమ్మవారి లడ్డు, అన్న ప్రసాదాలను తయారు చేయడంతో పాటు భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఎప్పటికప్పుడు అవసరమైన లడ్డూలను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన తెలిపారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా విజయవాడ బ్రాహ్మణ వీధిలో నిర్వహిస్తున్న లడ్డూ ప్రసాద తయారీ కేంద్రం (లడ్డూ పోటు), అన్న ప్రసాద తయారీ కేంద్రాలను కలెక్టర్ సృజన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భక్తులకు అత్యంత ప్రీతిపాత్రమైన అమ్మవారి లడ్డు ప్రసాదాల తయారీలో అత్యంత నాణ్యత ప్రమాణాలను పాటించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రసాదం తయారీకి విజయ నెయ్యిని వాడుతున్నట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు శాంపిల్స్ ను పరీక్షలు నిమిత్తం ల్యాబ్ కు పంపడం జరుగుతోందని, ఫలితాలను నమోదుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.లడ్డు పోటు,అన్న ప్రసాద తయారీకి వినియోగించే ముడి సరుకులు, ద్రవ్యాలను పరిశీలించడం జరిగిందన్నారు. ఫుడ్ సేఫ్టీ ఎస్వోపీ ప్రకారం ధ్రువీకరించిన మేరకు నాణ్యమైన ముడి సరుకులను వినియోగిస్తున్నారని, తయారీ విధానంలో జాగ్రత్తలు పాటిస్తున్నారన్నారు. నవరాత్రి ఉత్సవాలలో ఇప్పటివరకు ప్రతిరోజు 60 నుంచి 70 వేల వరకు లడ్డూలను విక్రయిస్తున్నట్లు వివరించారు. మొత్తంగా నవరాత్రి ఉత్సవాలలో 25 లక్షల లడ్డూలు విక్రయించే అవకాశం ఉందన్నారు. మూలా నక్షత్రం సందర్భంగా భక్తుల సంఖ్య అసాధారణ స్థాయిలో ఉంటుందన్నారు. అదే సమయంలో లడ్డు ప్రసాదానికి కూడా డిమాండ్ పెరుగుతుందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని రెండున్నర నుంచి మూడు లక్షల లడ్డూలను సిద్ధం చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అవసరమైతే ప్రసాద విక్రయ కేంద్రాలను అప్పటికప్పుడు పెంచేందుకు దేవస్థానం సిబ్బంది సిద్ధంగా ఉన్నారని వివరించారు. ఇప్పటికే కనకదుర్గ నగర్ తో పాటు రైల్వే స్టేషన్, బస్టాండ్, భవాని ఘాట్లలో కూడా ప్రసాద విక్రయ కేంద్రాలు ఉన్నాయని భక్తులు ఆయా కేంద్రాల్లో కూడా కొనుగోలు చేయవచ్చునన్నారు. లడ్డూలు ఎక్కువ కాలం నిలువ ఉండేలా అత్యంత నాణ్యత కలిగిన శనగపిండి, పంచదార, నూనె, నెయ్యి, జీడిపప్పు, కిస్మిస్, యాలకుల పొడి వాడుతున్నట్లుగా గమనించారు. అత్యంత పరిశుభ్ర వాతావరణంలో ఈ లడ్డు ప్రసాదం తయారు అవుతోందని వివరించారు. లడ్డు తయారీ కేంద్రాల నుంచి ఇతర ప్రాంతాల లడ్డు విక్రయ కేంద్రాలకు రవాణా చేసే సమయంలో రవాణా వాహనాలకు ఎదురవుతున్న ట్రాఫిక్ ఇబ్బందులను చక్క దిద్దాలని పోలీస్ అధికారులకు సూచించామన్నారు. అన్న ప్రసాదం విషయంలోనూ నాణ్యతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నట్లు వివరించారు. రోజుకు 25 వేల మందికి అన్నప్రసాద వితరణ చేస్తున్నట్లు తెలిపారు. కట్టె పొంగలి, పులిహోర, దద్యోజనం కూడా భక్తులకు అందిస్తున్నట్లు తెలిపారు. అన్న ప్రసాదంపై భక్తులు అత్యంత సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు వివరించారు.మూలా నక్షత్రం రోజు జగన్మాత సరస్వతి దేవిగా దర్శనం ఇస్తారు. మన పురాణ గ్రంధాల ప్రకారం అలంకారాలలో ఈ అలంకారానికి ఒక విశిష్టమైన గుర్తింపు ఉంది. సర్వ విద్యలకు అనుష్టాన దేవత అయిన సరస్వతి రూపాన్ని దర్శించేందుకు భక్తులు ప్రాధాన్యత ఇస్తారని, సరస్వతి దేవి రూపంలో ఉన్న జగన్మాతను దర్శించుకుంటే సర్వవిద్యాపారంగతులు అవుతారనే అచంచలమైన విశ్వాసంతో భారీ సంఖ్యలో వచ్చే భక్తులకు అవసరమైన ఏర్పాట్లు అన్ని ఇప్పటికే చేశామన్నారు. ప్రధానంగా ట్రాఫిక్ నియంత్రణ, క్యూలైన్ల క్రమబద్ధీకరణ, అన్నదానం కేంద్రాలలో ఏర్పాట్లు, మంచినీరు, మజ్జిగ, పసిపిల్లలకు వేడి పాలు వంటి అవసరాలతో పాటు అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. లడ్డు పోటు, అన్న ప్రసాద తయారీ కేంద్రాల తనిఖీలలో కలెక్టర్ వెంట ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్. రమ, ఏ.ఈ.ఓ. పి. చంద్రశేఖర్,సూపరింటెండెంట్ వై. హేమదుర్గ, సిబ్బంది కే. సీతారామయ్య, జగన్నాథరావు, ఆదినారాయణ, ఎ.కే.డి. కృష్ణ తదితరులు ఉన్నారు.

## కాలుష్య రహిత నగరానికి చర్యలు- విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర




**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 7 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కాలుష్యరాహిత నగరానికి విజయవాడ నగరపాలక సంస్థ చర్యలు తీసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. సోమవారం ఉదయం ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ లో నగర పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై శాఖాధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చర్చించారు. అందులో భాగంగా పచ్చదనాన్ని మరింత నగర సుందరీకరణ, కాలుష్య నియంత్రణ కొరకు సివేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల అభివృద్ధి, త్రాగునీరు మరియు నీటి సరఫరా, అనధికార నిర్మాణాలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా విజయవాడ నగరపాలక సంస్థ మాట్లాడుతూ ప్రజల నగరంలో ఎక్కువ మొక్కలను నాటుతు, కాలుష్యరహిత సమాజాన్ని నిర్మించేలా నగర సుందరీకరణ చేయటానికి ప్రణాళిక సిద్ధం చేయమని అధికారులను ఆదేశించారు. కేవలం వాయువు కాలుష్యమే కాకుండా నీటిని కూడా సివేజ్ స్టేట్మెంట్ ప్లాంట్ల అభివృద్ధి ద్వారా శుద్ధి చేస్తూ నీటి కాలుష్యాన్ని చర్యలు తీసుకోమని అధికారులు అన్న ఆదేశించారు. నగరంలో అనధికార నిర్మాణాలు జరగకుండా చూసుకోవాలని, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డి చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ జి వి జి ఎస్ వి ప్రసాద్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి రత్నావళి, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి సృజన, సూపరెండింటింగ్ ఇంజనీర్ (వర్క్స్) పి సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు వెంకటేశ్వర రెడ్డి, ఏ ఎస్ ఎన్ ప్రసాద్, సామ్రాజ్యం, చంద్రశేఖర్, ఎస్టేట్ ఆఫీసర్ టి శ్రీనివాస్, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, పి వో యు సి డి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## విధులు, అధికారాలపై పంచాయతీ సభ్యులకు అవగాహన అవసరం




**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 7 (వార్తా ప్రభ ప్రతినిధి):–** గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యుల విధులు, అధికారాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచ్ లు, వార్డు సభ్యుల శిక్షణ తరగతులను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ శిక్షణ తరగతులను పంచాయతీ సభ్యులు వినియోగించుకోవాలని సూచించారు. గతంలో సర్పంచ్ లకు శిక్షణ తరగతులు నిర్వహించారని చెప్పారు. పంచాయతీ రాజ్ చట్టాలు, తప్పనిసరి విధులు, వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణ, గ్రామీణ విద్యుదీకరణ, తాగునీటి సరఫరా, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, అంటువ్యాధుల నివారణ చర్యలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణపై ఈవోపీఆర్ అండ్ ఆర్డీ మనోజ్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో సునీత శర్మ, పంచాయతీ కార్యదర్శులు, ఉప సర్పంచ్ లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ఒక జిల్లాకు వి.ఎం రంగా కృష్ణాజిల్లాగా పేరు పెట్టాలి

■ సీనియర్ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ వినతి



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 7: (వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్రంలోని 26 జిల్లాలను త్వరలో 30 జిల్లాలుగా మార్పు చేస్తారని ఊహాగానాలు వినిపిస్తున్నాయని ,అలా కనుక చేస్తే ప్రస్తుతం ఉన్న ఎన్టీఆర్ జిల్లాకు వి యం రంగా కృష్ణాజిల్లాగా పేరు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ కుమార్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన చేస్తూ తూర్పు కృష్ణా జిల్లాకు ఎన్టీఆర్ కృష్ణ జిల్లాగా, పశ్చిమ కృష్ణకు వి.ఎం.రంగా కృష్ణాజిల్లాగా పేర్లు పెట్టాలని సూచించారు. స్వర్గీయ వంగవీటి మోహన రంగా బడుగు, బలహీన వర్గాల కోసం వారి అభ్యున్నతి కోసం అనేక పోరాటాలు చేసిన మహనీయుడని కొనియాడారు. పేదల కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అనేక ఉద్యమాలు చేశారని పేర్కొన్నారు. గతంలో వివిఎం రంగా విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి సేవలందించారని గుర్తు చేశారు. చివరిగా పేదల ఇళ్ల పట్టాల కోసం జరుగుతున్న పోరాటంలో భాగంగా ఆయన ఆమరణ నిరాహార దీక్షకు సైతం దిగారని , తన ప్రాణాలను సైతం ప్రజల కోసం అర్పించిన గొప్ప నాయకుడని పేర్కొన్నారు. అటువంటి మహానాయకుడైన వి.ఎం రంగా పేరును పశ్చిమ కృష్ణ జిల్లాకు సంబంధించి వి.ఎం.రంగా కృష్ణాజిల్లాగా నామకరణం చేస్తే సముచితంగా ఉంటుందని ఆకుల శ్రీనివాస్ పేర్కొన్నారు.

## తెల్లదొరలకు ధడ పుట్టించిన యోధుడు వడ్డె ఓబన్న



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 7 (వార్తా ప్రభ ప్రతినిధి):–** తెల్లదొరల వెన్నులో వణుకు పుట్టించిన రేనాటి వీరుడు, స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డె ఓబన్న అని వడ్డెర సంఘం నాయకులు కొనియాడారు. కొండపల్లి పట్టణ పరిధిలోని శ్రామిక నగర్ (కొత్త గేటు) సత్తెమ్మ తల్లి గుడి ప్రాంగణంలో వడ్డె ఓబన్న వర్ధంతి సభ సోమవారం నిర్వహించారు. ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కర్నూల్ జిల్లా రేనాటి ప్రాంతంలో ఓ మారుమూల గ్రామంలో 1807 జనవరి 11న ఓబన్న జన్మించారని చెప్పారు. ఆ ప్రాంతంలో పంటలు పండినా పండకపోయినా రైతులు పన్ను కట్టాల్సిందేనని బ్రిటిష్ వారు పీడిస్తుంటే వడ్డె ఓబన్న ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా రేనాటి ప్రాంతంలో ఒక నిప్పు రవ్వలా మహా ఉద్యమాన్ని నిర్వహించారన్నారు. ఓబన్న ఉద్యమ చరిత్ర చిరస్మరణీయమన్నారు. ఓబన్న స్ఫూర్తితో వడ్డెరలు హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొండపల్లి మున్సిపాలిటీ వైసీపీ చైర్మన్ అభ్యర్థి గుంజ శ్రీనివాసు, ఇర్ల దుర్గారావు, కుంచం శివ, ఇర్ల పెద్దిరాజు, వేముల నాగరాజు, వల్లెపు శ్రీను, బొంత బుజ్జి, తమ్మిశెట్టి నరసింహారావు, ఉప్పతల శ్రీనివాసరావు, వడ్డెర యువత, ఉద్యోగులు, విద్యావంతులు పాల్గొన్నారు.

# విజయవాడ ప్రజలకు కష్టాలు, కన్నీళ్లు మిగిలితే కూటమి నాయకులకు, చంద్రబాబు కి కోట్ల రూపాయలు మిగిలాయి..

■ చంద్రబాబు కి వందల కోట్ల రూపాయలు మిగల్చడానికే బుడమేరు వొచ్చింది. ■ చంద్రబాబు కి ఒక పక్క ఫోటో షూట్స్.. మరోపక్క విరాళాల వరద. ■ బుడమేరు, చంద్రబాబు ఇద్దరు మిలకత్ అయ్యారు..■ వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన వెంకట మహేష్



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 7 :(వార్తా ప్రభ ప్రతినిధి)**బుడమేరు వరద చంద్రబాబు కి, కూటమి ప్రభుత్వం కి వందల కోట్లు మిగిల్చిందని రాష్ట్ర వైసీపీ అధికార ప్రతినిధి పోతిన వెంకట మహేష్ ఆరోపించారు.వరద లో 100ల కోట్లు ఖర్చు చేశారు.పునరావాసం కోసం కోటి 40 లక్షలు ఖర్చు చేశారు..368 కోట్లు ఫుడ్ కోసం ఖర్చు చేశారు..బాధితులకు నష్ట పరిహారం 200 కోట్లు ఇవ్వలేదు.. కానీ ఫుడ్ పేరుతో ఎన్డీయే కూటమి ప్రభుత్వం పాలకులు పందికొక్కుల్లా తిన్నారని పోతిన ధ్వజమెత్తారు. సోమవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎన్డీయే ప్రభుత్వం పై విమర్శల వర్షం కురిపించారు.వరద బాధితులకు ఆహారం అమ్మవారు ఇచ్చారు, ద్వారక తిరుమల, సింహాద్రి అప్పన్న నుండి వొచ్చింది..దేవుడు భోజనాలు పెడితే 368కోట్లు ఫుడ్ కి ఏ పందికొక్కులు తిన్నాయి.. చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.రూ26 కోట్లతో వాటర్ బాటిల్స్ పంపిణీ చేశామని చెప్పారు.. 6 లక్షల మంది వరద లో ఉంటే కోటిన్నర బాటిల్స్ఎవరికి ఇచ్చారు..జగన్ కోటి రూపాయలతో వాటర్ బాటిల్స్, పాల ప్యాకెట్స్ తీసుకొన్నారు..గుక్కెడు మంచి నీళ్ల కోసం ప్రజలు ఇబ్బందులు పడ్డారు..రూ52కోట్లు శానిటేషన్ కోసం ఖర్చు చెప్పారు..ఎక్కడ ఖర్చు పెట్టారని ప్రశ్నించారు.కొవ్వొత్తులు, అగ్గిపెట్టాల కోసం 23 కోట్లు ఖర్చు చేశారు..డ్రోన్స్ కోసం 2కోట్లు ఖర్చు అయింది..వరద బాధితులకు సరిగ్గా 10మందికి కూడా ఆహారం అందించలేదన్నారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి డ్రోన్స్ ద్వారా ఆహారం అందిస్తున్నట్లు ఫోటో వదిలారు.. దానికి 2కోట్లు..రూ 534 కోట్లకు టెండర్ వేశారు..వచ్చిన విరాళాలకు ఖర్చులు చూపించారు..ఎవరికి కాంట్రాక్టు ఇచ్చారో.. ఎంతకీ ఇచ్చారో లెక్కలు బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.నష్ట పరిహారం చెల్లించారా? నష్ట పరిహారం కోసం ప్రజలు రొడెక్కితే లాఠీ ఛార్జ్ చేశారు.. కలెక్టర్ వద్ద బాధితులు క్యూ కడుతున్నారు..ఎన్యుమరేషన్ కోసం కలెక్టరేట్ కి రోజు వేలమంది వస్తున్నారు..పేదల జీవితాలు చిన్నాభిన్నం అయితే చంద్రబాబు ఎందుకు సాదించారన్నారు.జగన్ మోహన్ రెడ్డి అధికారంలో ఉంటె ఈ పరిస్థితి వొచ్చేది కాదు.నష్టపోతే గంటల వ్యవధిలోనే బాధితుల అకౌంట్ లో బాధితుల అకౌంట్ లో అమౌంట్ వేశారు.జగన్ పై అక్కసు తో సచివాలయం వ్యవస్థ ను, వలంటీర్ వ్యవస్థ ని నీరు కార్చాడు చంద్రబాబు..జగన్ కి, చంద్రబాబు కూటమి కి ఉన్న వ్యత్యాసం ప్రజలు గమనించాలి..విజయవాడ ప్రజలు కళ్ళలో కన్నీళ్లు వస్తున్నాయి అంటే చంద్రబాబు చేసిన తప్పిదమే..మళ్ళీ వరద ప్రాంతల్లో ఎన్యుమరేషన్ చేయాలి.. నష్ట పోయిన ప్రతి ఒక్కరికి పరిహారం అందించాలి..బాధితుల తరపున వైస్సార్సీపీ పోరాటం చేస్తుంది..వరద బాధితులను పరమర్శించని పవన్.. మత విద్వేషాలను రెచ్చ కొడుతున్నాడు..పవన్ కి ప్రజలు బుద్ధి చెపుతారు..విజయవాడ ముందే మునిగిపోతుందని తెలిసి తెందుకు సిసోడియా చెప్పలేదు..అగ్గిపెట్టెలకు, కొవ్వొత్తులకు 23కోట్లు ఖర్చు అయిందని ప్రభుత్వం చెపితే సిసోడియా కవరింగ్ చేస్తున్నారు..భోజనాల ఖర్చు ఏ పందికొక్కులు తిన్నాయో సమాధానం చెప్పాలని పోతిన డిమాండ్ చేశారు.

# నూతన కమిషనర్ బాధ్యతల స్వీకరణ

## కొండపల్లి పురపాలక సంఘం నూతన కమిషనర్ శ్రీనివాసరావు

**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 7 (వార్తా ప్రభ ప్రతినిధి):** – కొండపల్లి పురపాలక సంఘంలో సుపరిపాలనను అందిస్తామని మున్సిపల్ కమిషనర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. కొండపల్లి పురపాలక సంఘం నూతన కమిషనర్ గా సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ అడిషనల్ కమిషనర్ గా పనిచేసిన విజయవాడ మున్సిపల్ జోనల్ కమిషనర్ బి.రమ్యకీర్తన తిరిగి తన స్థానానికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ లో అసిస్టెంట్ కమిషనర్ గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు గుంటూరు పురపాలక సంఘం సెక్రటరీగా బదిలీ అయి అక్కడి నుంచి కొండపల్లి మున్సిపల్ అడిషనల్ కమిషనర్ గా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రప్రభతో మాట్లాడారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి పట్టణంలో సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు చెప్పారు. పట్టణ ప్రజలు ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల మధ్య కార్యాలయంలో తనను కలిసి సమస్యలు వివరించవచ్చని తెలిపారు.

# శ్రీశ్రీశ్రీ గంగా-దుర్గా-మారమ్మవిశ్వేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో సామూహిక కుంకుమార్చనలు

**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 7 : (వార్తా ప్రభ ప్రతినిధి)** దసరాశరన్నవరాత్రి వేడుకలు సందర్భంగా చిట్టినగర్ కుండల మార్కెట్ వద్ద గల



శ్రీశ్రీశ్రీ గంగా-దుర్గా-మారమ్మ విశ్వేశ్వర స్వామి దేవస్థానం లో సోమవారంసామూహిక కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. దసరా ఉత్సవాల్లో ఇదోరోజుఆలయ ఉపాసకురాలు తమ్మిన రవీనాఆధ్వర్యంలో జరుగుతున్నఈ వేడుకల్లో భాగంగా అమ్మవారు శ్రీ చండీదేవి అలంకారంలో భక్తుల కుదర్శనమిచ్చారు. మహిళల కుఎంతో ఇష్టమైన దసరా ఉత్సవాలలో సోమవారంఉదయం వందలాది మందిముత్తైదువులకు ఈ సామూహికకుంకుమార్చన లో పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారిచేతులు మీడియా పూజలు నిర్వహించారు. వందలాదిమంది భక్తులుఅమ్మవారిని దర్శించుకున్నారు. దేవీ ఉపాసకురాలు తమ్మిన రవీనా చేతులు మీదుగాఅన్నదానం ప్రారంభించగా వందలాది మంది అమ్మవారి అన్న ప్రసాదాలు ఆరగించారు.

# వృత్తి విద్యపై విద్యార్థులకు అవగాహన



**కలువాయి అక్టోబర్ 07 (వార్తాప్రభ)** రేవూరు జెడ్ పి హైస్కూల్ కి సంబందించిన 10 వ తరగతి విద్యార్థులకు టైమ్స్ సెంటర్ ఫర్ లెర్నింగ్ లిమిటెడ్ కంపెనీ ఆద్వర్యంలో రేవూరు జెడ్పి హైస్కూల్ ప్రదానోపాధ్యా యులు ఎ.వెంకటేశ్వర్లు సహకారంతో 10 రోజుల పాటు ఇంటర్న్ షిప్ పై అవగాహన కల్పించనున్నట్లు వృత్తి విద్య ఉపాద్యాయుడు డి. రవిశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా డి రవిశంకర్ మాట్లాడుతూ కేంద్ర ఆర్దిక మంత్రి నిర్మల సీతారామన్ 2024 వియం ఇంటర్న్ షిప్ ప్రారంభించినట్లు తెలిపారు. విద్యార్థులకు స్వయం ఉపాధి అవకాశాలు కూడా రావాలన్న ఉద్దేశ్యంతో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా మన్నారు. ఇందులోభాగంగా శేఖర్ సూపర్ మార్కెట్ స్రవంతి ఎలక్ట్రానిక్స్ హ్యాండ్ సమ్ బట్టల షాపుల నందు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తూ వాటిపై అవగాహన కల్పించారు. ఒకేషనల్ కో ఆర్డినేటర్స్ పైడి కార్తీక్ బారు శ్రీను సూచనలతో ఈ ఇంటర్న్ షిప్ శిక్షణ కార్యక్రమం 10 రోజుల పాటు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

# గోగులపాటి కృష్ణమోహన్ కు సన్మానం



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 7 (వార్తాప్రభ)** : యువ అవధాని, పద్య సారస్వత పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు అవుసుల భానుప్రకాశ్ రచించిన ట్రెండింగ్ పద్యాలు పుస్తక పరిచయ కార్యక్రమం సిద్దిపేటలో వ్యాసమహర్షి యోగా సెంటర్ లో సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి నా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గోగులపాటి కృష్ణమోహన్ ఆత్మీయ అతిథి గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోగులపాటి కృష్ణమోహన్ మాట్లాడుతూ పద్యమనేది సరళమైన పదాలతో రాసినపుడే ప్రజల్లోకి చేరుతాయని అన్నారు. యువావధాని అవుసుల భానుప్రకాశ్ ట్రెండింగ్ పద్యాల పేరుతో ఆంగ్ల పదాలను తెలుగు పదాలతో సంధి చేస్తూ నేటి యువత కు అవసరమైన పద్యాలను చక్కగా అందజేశారని అన్నారు. ఈ పుస్తకం ప్రతి ఒక్కరికి చేరేలా కవులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత అవుసుల భానుప్రకాశ్ మాట్లాడుతూ నేటి యువత పలురకాలుగా వ్యసనాలకు బానిసలై దారి తప్పుతున్నారని, వారికి అవగాహన కల్పించేందుకు సులభ పదాలతో ఆంగ్ల పదాలను ఇమిడ్చి పద్యాలను ట్రెండింగ్ పద్యాలు పేరుతో పుస్తకం ముద్రించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి వరుకోలు లక్ష్మయ్య సభాధ్యక్షత వహించి పుస్తకంలోని పలు పద్యాలను రాగయుక్తంగా ఆలపించగా.. ప్రముఖ కవయిత్రి, సమీక్షా సమ్రాజ్ఞి సరస్వతి రామశర్మ చక్కగా పుస్తక సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో బాలసాహిత్య కవి ఉండ్రాళ్ళ రాజేశం, రాజ్ కుమార్ బస్వ, ఐత చంద్రయ్య, ఎన్నవెళ్ళి రాజమౌళి, సీనియర్ జర్నలిస్టు కొమరవెల్లి అంజయ్య, సింగీతం నరసింహారావు, దాసరి శాంతకుమారి, తిరుమల కాంతి కృష్ణ, ఎడ్ల లక్ష్మి ప్రభృతులు పాల్గొన్నారు.


# వన్యప్రాణులను రక్షణ అందరి బాధ్యత



## – డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రామిరెడ్డి

**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 7 (వార్తా ప్రభ ప్రతినిధి):** – వన్య ప్రాణులను రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రామిరెడ్డి అన్నారు. వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలను పురస్కరించుకుని కొండపల్లి ఖిల్లా రోడ్డు బొమ్మల కాలనీలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల్లో వన్యప్రాణులు అంతరించిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వన్యప్రాణులను వేటాడటం నేరమన్నారు. అడవులను, వన్యప్రాణులను సంరక్షిస్తేనే మానవ మనుగడ సాధ్యమవుతుందన్నారు. వన్యప్రాణులను కాపాడేందుకు అటవీ సిబ్బందితో పాటు ప్రజలు కూడా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్ డీవో దుర్గారావు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ ఎస్.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగం ఇప్పిస్తానని మహిళకు 5 లక్షల టోకరా



**మచిలీపట్నం అక్టోబర్ 7 (వార్తా ప్రభ ప్రతినిధి)**మచిలీపట్నం గతంలో సచివాలయం వాలంటరీగా పని చేసిన పరిచయంతో రేఖపల్లి నీలిమ దుర్గా అనే మహిళకి ఉద్యోగం ఇస్తానని ఐదు లక్షల టోకరా వేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే 25వ సచివాలయంలో వైఎస్ఆర్సిపి ప్రభుత్వ హయాంలో వాలంటరీగా విధులు నిర్వర్తించింది. బండారు సత్యనారాయణ, తమ్ము గంగాభవాని, సురేష్ అనువార్ల కింద వాలంటరీగా విధులు నిర్వహిస్తూ ఎన్నికల సమయంలో ఆ విధుల నుండి రాజీనామా చేసి వైదొలిగింది. ఆ సమయం నుండి నీలిమ దుర్గ ఖాళీగా ఉండడంతో సత్యనారాయణ పిలిపించి ఏమన్నా ఉద్యోగం చేస్తావా అని అడిగి మున్సిపాలిటీలో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని నమ్మబలికి ఆమె వద్ద నుండి ఐదు లక్షల రూపాయలు సత్యనారాయణ అల్లుడైన సురేష్ కు ఇప్పించడం జరిగినది. అందు లో భాగంగా ఈ నెల మూడో తేదీన మచిలీపట్నం మున్సిపల్ కార్యాలయంలో జాబు వచ్చినట్లుగా ఐడి తో కూడుకున్న ప్రూఫ్ లను నీలిమ దుర్గా కు అందించి మూడో తేదీన జాయిన్ అవమని చెప్పడం జరిగింది. నీలిమ దుర్గ వారి నీ నమ్మి మున్సిపల్ కార్యాలయానికి వెళ్ళగా ఈ ఐడి నెంబర్ త మ్ము దుర్గా భవానిపై ఉన్నదని కావాలని నిన్ను మోసం చేశారని సెక్షన్ అధికారి వెల్లడించడం జరిగింది. దీంతో జరిగిన విషయం సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగా ఎక్కడో తప్పు జరిగిందని మరలా నమ్మబలికి తర్వాత ఏ విధమైన స్పందన లేకుండా ఫోన్లో స్విచ్ ఆఫ్ చేశారని ఆమె వాపోయింది ఈ విషయమై తాను మోసపోయానని గ్రహించి, ఇనుకుదురు పోలీస్ స్టేషన్లో కేసు కూడా పెట్టడం జరిగిందని ఆమె వెల్లడించింది. ఈ ఐదు లక్షల తమ వద్ద ఉన్న నగలు తాకట్టు పెట్టి కొద్దిపాటి సొమ్మును ఇతరుల వద్ద వడ్డీకి తీసుకుని బండారు సత్యనారాయణకు ఇవ్వడం జరిగిందని నాకు న్యాయం చేయాలని ఆమె విజ్ఞప్తి చేసింది.

# హిమాచల్ ఆర్ టి సి లో ఎల్ 1 గా ఒలెక్ట్రా

- **327 బస్సులకు టెండర్లు పిలిచిన హెచ్ ఆర్ టి సి**
- **స్విచ్ మొబిలిటీ కన్నా తక్కువ ధర పొందుపరిచిన ఒలెక్ట్రా**
- **ఇప్పటికే హిమాచల్ ఆర్ టి సి కి బస్సులు సరఫరా చేసిన ఒలెక్ట్రా**
- **మనాలి రోహ్తాంగ్ మధ్య 13 వేల మీటర్ల ఎత్తులో నడుస్తున్న ఒలెక్ట్రా బస్సులు**



**హైదరాబాద్, అక్టోబర్ 7 (వార్తా ప్రభ ప్రతినిధి)**విద్యుత్ బస్సుల కొనుగోలుకు హిమాచల్ రోడ్డు రవాణా సంస్థ (హెచ్ ఆర్ టి సి) పిలిచిన టెండర్లలో ఒలెక్ట్రా గ్రీన్టెక్ తక్కువ ధర కోట్ చేసి ఎల్ 1 బిడ్డర్ గా నిలిచింది. హెచ్ ఆర్ టి సి 327 విద్యుత్ బస్సుల కొనుగోలుకు తాజాగా టెండర్లు పిలిచింది. ఇందులో తొమ్మిది మీటర్ల బస్సులు 297, 12 మీటర్ల బస్సులు 30 ఉన్నాయి. ఒలెక్ట్రా గ్రీన్ టెక్, స్విచ్ మొబిలిటీ టెండర్లలో పాల్గొన్నాయి. టెండర్ ప్రక్రియ అనంతరం నిర్వహించిన సాంకేతిక పరీక్షల్లో రెండు సంస్థలు అర్హత సాధించాయి. అయితే తక్కువ ధర కోట్ చేసి ఒలెక్ట్రా సంస్థ అంతిమంగా ఎల్ 1 గా నిలిచింది. హిమాచల్ రాష్ట్ర ప్రజల అవసరాల నిమిత్తం త్వరితగతిన బస్సులను కొనుగోలు చేయాలనే ఉద్దేశ్యంతో ఉన్న ఆర్ టి సి త్వరలో ఆర్డర్ ఖరారు చేయనుంది. కర్బన ఉద్గారాలను తగ్గించాలనే ఉద్దేశంతో విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టిన రోడ్డు రవాణా సంస్థల్లో హెచ్ ఆర్ టి సి ఒకటి. 2017 సెప్టెంబర్లో ఈ సంస్థ విద్యుత్ బస్సులను తొలిసారి కొనుగోలు చేసింది. ఒలెక్ట్రా సంస్థ అపుడు 25 బస్సులను విక్రయించింది. వాటిని కులు మనాలి రోహ్తాంగ్ మధ్య ఆర్ టి సి నడుపుతోంది. మనాలి రోహ్తాంగ్ మధ్య 13 వేల కిలోమీటర్ల ఎత్తులో ఈ బస్సులు నడుస్తున్నాయి. ప్రపంచంలో ఈ ఎత్తులో ఒలెక్ట్రా విద్యుత్ బస్సులు నడుస్తూ రికార్డ్ సృష్టించాయి. అత్యధిక ఎత్తులో కూడా ఒలెక్ట్రా బస్సులు నడుస్తూ అద్వితీయమైన పనితీరును కనపరుస్తున్నాయి. హిమాచల్ కొండల్లో పర్యావరణాన్ని పరిరక్షించడంలో ఒలెక్ట్రా బస్సులు కీలక పాత్ర పోషిస్తున్నాయి. హెచ్ ఆర్ టి సి కి సరఫరా చేయనున్న బస్సులో ప్రయాణికుల సౌకర్యార్థం అత్యాధునిక సౌకర్యాలను ఒలెక్ట్రా పొందుపరచనుంది. అడ్వాన్స్డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్(ఏ డి ఏ ఎస్), ఎయిర్ సస్పెన్షన్ , ఎలక్ట్రిక్ స్టెబిలిటీ కంట్రోల్ తో కూడిన డిస్క్ బ్రేక్ వ్యవస్థ ఇందులో ఉంటాయి. తొమ్మిది మీటర్ల నిడివి గల బస్సులు ఒకసారి ఛార్జ్ చేస్తే 180 కిలోమీటర్లు ప్రయాణిస్తాయి. డ్రైవర్ తో కలిపి 31 మంది ఇందులో ప్రయాణించవచ్చు. 12 మీటర్ల బస్సులు ఒకసారి ఛార్జ్ చేస్తే 250 కిలోమీటర్లు ప్రయాణిస్తాయి. ఇందులో డ్రైవర్ తో కలిపి 38 మంది ప్రయాణించవచ్చు.

# ప్రమాదకరంగా కృత్రిమమేధ



**దిల్లీ:** కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికపై కేంద్రమంత్రి విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. కౌటిల్య ఎకనామిక్ సదస్సులో పాల్గొన్న ఆయన ఏఐ వల్ల ఉత్పన్నమయ్యే ప్రమాదాల గురించి హెచ్చరించారు. రాబోయే దశాబ్ది కాలంలో ఇది ప్రపంచాన్ని తీవ్ర ప్రభావితం చేస్తుందన్నారు."ప్రపంచ పర్యావరణ వ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది కీలకమైన అంశం. ఒకప్పటి అణ్వాయుధాల్లానే ప్రస్తుతం ఇది కూడా చాలా ప్రమాదకరం. దీన్నుంచి సంభవించే పరిణామాలను ఎదుర్కోవడానికి అన్ని దేశాలూ సిద్ధంగా ఉండాలి" అని జై శంకర్ అన్నారు. రానున్న కాలంలో ఏఐ ప్రభావం అధికంగా ఉండనుందన్నారు. ప్రపంచీకరణ గురించి మాట్లాడిన ఆయన.. రాబోయే రోజుల్లో ప్రపంచీకరణ అనేది ఆయుధంగా మారొచ్చని, దీనిపట్ల ప్రపంచ దేశాలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఐక్యరాజ్య సమితి గురించి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ.. "ఇది ఆర్థికపరమైన సమావేశం. అందువల్ల బిజినెస్ మాటల్లోనే వివరిస్తా. ఐక్యరాజ్య సమితి పాత వ్యాపారంలా మారింది. దాని పరిధి చాలా ఉన్నప్పటికీ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మార్పులు జరగడంలేదు. బిజినెస్ ప్రపంచంలో స్టార్టప్‌ల మాదిరిగా ఐరాస కూడా ముందుకు సాగాల్సి ఉంది" అని అభిప్రాయపడ్డారు. ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్, పాశ్చాత్య ఎజెండాను భారత్‌పై రుద్దాలని చూస్తున్న జార్జి సోరోస్‌లతో ఎవరితో కలిసి రాత్రి విందుకు ఇష్టపడతారన్న ప్రశ్నకు..జైశంకర్ తెలివిగా సమాధానం ఇచ్చి అందర్ని ఆశ్చర్యపరిచారు. ప్రస్తుతం శరన్నవరాత్రి ఉత్సవాల జరుగుతున్న నేపథ్యంలో తాను ఉపవాస దీక్షలో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

# డిప్యూటీ సీఎం పవన్ కు నటుడు షాయాజీ కొత్త ప్రపోజల్



రీల్ జీవితానికి రియల్ జీవితానికి ఏ మాత్రం పోలిక ఉండదు. ఆన్ స్క్రీన్ మీద విలనిజాన్ని పండించడంలో తిరుగులేని నటుడు షాయాజీ షిండే. రీల్ లో ఎంత కర్కసత్వంగా వ్యవహరిస్తారో.. రియల్ లైఫ్ లో అందుకు భిన్నమైన ధోరణి ఆయన సొంతం. తాజాగా ఆయన ఒక కార్యక్రమంలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అవి ఇప్పుడు హాట్ చర్చకు దారి తీయటమే కాదు.. షాయాజీ షిండే వ్యాఖ్యలు వాస్తవరూపంలోకి తెస్తే మరింత బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇంతకూ ఆయనేమన్నారు? ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అపాయింట్ మెంట్ ఎందుకు కోరుకుంటున్నారు? ఈ విషయం పవన్ కల్యాణ్ కు ఏ రీతిలో చేరుతుంది? ఆయన స్పందన ఏమిటి? లాంటి ప్రశ్నలు ఇప్పుడు తెర మీదకు వచ్చాయి. ఇంతకూ అసలేం జరిగిందంటే.. సుధీర్ బాబు నటించిన తాజా చిత్రం 'మా నాన్న సూపర్ హీరో'. ఈ 11న ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఈ మూవీని ప్రమోట్ చేసేందుకు ఈ సినిమా టీంలోని ముఖ్యులు బిగ్ బాస్ సీజన్ 8లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలక్షణ నటుడు షాయాజీ షిండేకు సంబంధించిన ఒక ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. ఖాళీ స్థలం కనిపిస్తే షాయాజీ చెట్లను నాటతారని చెప్పటంతో ఈ షో వ్యాఖ్యాత నాగార్జున ఆశ్చర్యపోయారు. అంతలా మొక్కలు ఎందుకు నాటుతున్నట్లు? అన్న విషయాన్ని అడిగి.. దానికి కారణం ఏమిటి? అని ప్రశ్నించారు. దీంతో.. షాయాజీ ఓపెన్ అయ్యారు. తన తల్లి 97 ఏళ్ల వయసులో కన్నుమూశారని.. ఆమె బతికి ఉన్నప్పుడు తన దగ్గర ఎంతో డబ్బున్నా.. దాంతో ఆమెను తానుబతికించుకోలేకపోయానని చెప్పారు. ఆమెను తాను బతికించుకోకపోవటంతో తానెంతో బాధ పడినట్లుగా పేర్కొన్నారు. ఆమెను బతికించుకోలేని నేను.. మా అమ్మగారి బరువుకు సమానమైన విత్తనాల్ని తీసుకొని దేశం మొత్తం నాటుతానని చెప్పినట్లుగా పేర్కొన్నారు. తాను నాటిన చెట్లు కొన్నాళ్లకు పెరిగి నీడను.. పూలు.. పండ్లు ఇస్తాయని పేర్కొన్నారు. వాటిని చూసినప్పుడల్లా తన తల్లే గుర్తుకు వస్తుందన్నారు. తన తల్లి తర్వాత తనకు భూమాతే అంతగా గుర్తుకు వస్తారన్నారు. సాధారణంగా ఆలయాలకు వెళితే ప్రసాదాలు ఇస్తారని.. ప్రసాదంతో పాటు ఒక మొక్కను కూడా ఇస్తే బాగుటుందన్న సూచన చేశారు. తనకు ఏపీ ఉప ముఖ్యమంత్రి కలసుకునేందుకు టైమిస్తే.. తాను ఈ విషయాన్ని ఆయనకు నేరుగా చెబుతానని చెప్పారు. భక్తులకు మొక్కను ఇస్తే.. వాటిని తీసుకెళ్లిన భక్తులు నాటుతారని.. అందులోనూ భగవంతుడ్ని చూడొచ్చన్నారు. మహారాష్ట్రలోని మూడు ఆలయాల్లో తానీ విధానాన్ని ప్రారంభించినట్లుగా పేర్కొన్నారు. అయితే.. తాను మొక్కటు ఇస్తున్న మూడు ఆలయాల్లో ప్రతి ఒక్క భక్తుడికి ఇవ్వరని.. ఎవరైతే అభిషేకం చేయించుకుంటారో.. వారికి ప్రసాదంలా మొక్కల్ని ఇస్తారన్నారు. ఇలా రోజుకు వంద.. రెండు వందల మందికి ఇస్తారన్నారు. తనకు ఏపీ డిప్యూటీ సీఎం అపాయింట్ మెంట్ ఇస్తే.. ఆయన్ను కలిసి ఈ విషయాన్ని చెబుతానని పేర్కొన్నారు. షాయాజీ షిండే చెప్పిన విషయాన్ని పవన్ కల్యాణ్ కు ఎలా చేరుతుందన్న ప్రశ్నకు.. నాగ్ స్పందిస్తూ "ఆయనకు భారీగా అభిమానులు ఉన్నారు. వారే.. ఆయన వద్దకు ఆ విషయాన్ని తీసుకెళతారు" అని చెప్పటం ఆసక్తికరంగా మారింది. మరి.. పవన్ ఎప్పుడు రియాక్టు అవుతారో చూడాలి.

# ఎన్టీఆర్ - నీల్ మూవీలో ఆ ఇద్దరు స్టార్ హీరోయిన్లు?



మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్, కన్నడ స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్ లో ఓ భారీ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఎన్టీఆర్ – నీల్ అనే వర్కింగ్ టైటిల్ తో పిలవబడుతున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ పై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం 'దేవర' సక్సెస్ ను ఎంజాయ్ చేస్తున్న తారక్.. త్వరలోనే సెట్స్ లో అడుగుపెట్టబోతున్నారు. అయితే ఇప్పుడు ఈ సినిమాలో హీరోయిన్లకు సంబంధించిన ఓ ఇంట్రెస్టింగ్ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఎన్టీఆర్ తో భిన్నమైన భావోద్వేగాలతో కూడిన ఓ వైవిధ్యభరితమైన చిత్రం చేస్తున్నానని, ఇది తనకూ చాలా కొత్త కథ అని దర్శకుడు ప్రశాంత్ నీల్ చెబుతూ వస్తున్నారు. ఇందులో నేషనల్ క్రష్ రష్మిక మందన్నను హీరోయిన్ గా తీసుకునే అవకాశం ఉందని ఫిలిం సర్కిల్స్ లో టాక్ వినిపిస్తోంది. అంతేకాదు ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ కోసం స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభును పరిశీలిస్తున్నారనే రూమర్ కూడా వినిపిస్తోంది. 'కెజియఫ్: చాప్టర్ 1' చిత్రంలో తమన్నా భాటియాతో ఐటెం సాంగ్ చేయించిన ప్రశాంత్ నీల్.. ఇప్పుడు తారక్ సినిమాలో ఓ ప్రత్యేక గీతంలో సమంతతో స్టెప్పులేయించాలని భావిస్తున్నారట. ఇందులో నిజమెంతనేది తెలియదు కానీ, ఈ న్యూస్ మాత్రం ఫ్యాన్స్ ను ఎంతో ఎగ్జైట్ చేస్తోంది. 'పుష్ప' మూవీలో ఊ అంటావా మావా అంటూ పాన్ ఇండియాని ఊపేసిన సామ్.. ఎన్టీఆర్ తో కలిసి డ్యాన్స్ చేస్తే థియేటర్లు షేక్ అవ్వడం గ్యారంటీ



అని కామెంట్స్ చేస్తున్నారు. కాకపోతే 'పుష్ప' తర్వాత సమంత మరో ఐటెం సాంగ్ చెయ్యలేదు. ఫీమేల్ ఓరియెంటెడ్ సినిమాలు, వెబ్ సిరీసులు చేసుకుంటూ ముందుకు సాగుతోంది. అలానే సొంతంగా బ్యానర్ స్థాపించి నిర్మాతగానూ మారుతోంది. ఇలాంటి టైంలో తారక్ తో స్పెషల్ సాంగ్ చేయడానికి సామ్ ఓకే అంతుందా లేదా అనేది చూడాలి. గతంలో 'బృందావనం', 'రభస', 'జనతా గ్యారేజ్' వంటి సినిమాలలో తారక్ – సమంత కలిసి నటించిన విషయం తెలిసిందే. తారక్ – ప్రశాంత్ నీల్ చిత్రానికి 'డ్రాగన్' అనే పేరు ప్రచారంలో ఉంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాని 2026 సంక్రాంతి సందర్భంగా జనవరి 9వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు ఓపెనింగ్ రోజునే చిత్ర యూనిట్ ప్రకటించింది.

# కమ్మవారి ఐక్య సేవాసమితి ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో రిక్షా కార్మికులకు స్టీల్ ప్లేట్లు, కూరగాయలు బియ్యం పంపిణీ



**హనుమాన్ జంక్షన్,అక్టోబరు 7 (వార్తాప్రభ) :** హనుమాన్ జంక్షన్ ఎంఎన్ఆర్ కాంప్లెక్స్ శ్రీశాన్వి ఫైనాన్స్ వద్ద కమ్మవారి ఐక్య సేవాసమితి ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో రిక్షా, ముఠా కార్మికులకు, స్టీల్ ప్లేట్లు, బియ్యము కూరగాయలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సమితి గౌరవ సలహాదారులు అట్లూరి రాజశేఖర్ మాట్లాడుతూ పకృత వైపరీత్యాలు సంభవించినప్పుడు బాధితులకు సహాయం అందించడంలో కమ్మవారి ఐక్య సేవా సమితి ముందుంటుందని ఇటీవల వరద బాధితులకు భోజనం, నిత్యవసర, వస్తువులు, వంట సామాగ్రి పంపిణీ చేసినట్లు అట్లూరి రాజశేఖర్ తెలియజేశారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పరుచూరి రామకృష్ణ మాట్లాడుతూ సమితి ద్వారా పరుచూరి వైష్ణవి ఫౌండేషన్ సహకారంతో గత రెండు సంవత్సరాలుగా రిక్షా కార్మికులకు ప్రతి మంగళవారం భోజనం అందజేస్తున్నామని, భవిష్యత్తులో వారంలో ఒకరోజు నిరుపేదలకు నిత్యవసర వస్తువులు కూరగాయలు అందచేయడానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సమితి సహాయ కార్యదర్శి పొట్లూరి శ్రీ సత్య ఫణీంద్ర కుమార్, చిగులూరి ఫణీంద్ర కుమార్, పరుచూరి ధీరజ్ మణికంఠ సాయి, సీనియర్ జర్నలిస్టులు చలమలశెట్టి శ్రీనివాసరావు, ధనియాల అప్పారావు, రామకృష్ణ, ప్రముఖ సామాజిక వేత్తలు పొతకమూరి చటర్జీ,పొతకమూరి మధు తదితరులు పాల్గొన్నారు.

# కోడూరు మండల నూతన ఎంపీడీవో ని సన్మానించిన కూటమినేతలు



**కోడూరు,అక్టోబరు 7 (వార్తాప్రభ) :** కోడూరు మండల నూతన మండల పరిషత్ అభివృద్ధి అధికారి గా బాధ్యతలు స్వీకరించిన శ్రీ సుధా ప్రవీణ్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి దృశ్యాలువాతో సన్మానించిన కోడూరు మండలం కూటమి నేతలు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని ఆటుపాట్లను ఎదుర్కొని అయినా సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేసే ప్రయత్నం చేస్తున్నారు. కనుక మీరు కూడా మండల అభివృద్ధిలో భాగస్వామి అయి అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు వారధిగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కోడూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు, జనసేన నాయకులు ఉల్లి శేషగిరి, ముద్దినేని చందర్రావు, బచ్చు వెంకటేష్, దామెర్ల నారాయణ, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, బండే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య వృత్తికి అంకితభావం కావాలి : డాక్టర్ దుట్టా రామచంద్రరావు



**హనుమాన్ జంక్షన్,అక్టోబరు 7 (వార్తాప్రభ) :** వైద్య వృత్తిలో క్రమశిక్షణతో మెలిగిన వ్యక్తి డాక్టర్ గోగినేని భాస్కరరావు అని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మెన్ చలసాని ఆంజనేయులు అన్నారు. సోవ-ంవారం హనుమాన్ జంక్షన్ కాకాని కళ్యాణ మంటపం లో ఇటీవల మరణించిన సీనియర్ డాక్టర్ గోగినేని సంతాప సభ స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్య ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. చైర్మన్ చలసాని మాట్లాడుతూ సేవా దృక్పథంతో వృత్తి పట్ల అంకితభావం కలిగిన వ్యక్తి డాక్టర్ గోగినేని అని అన్నారు. డాక్టర్ దుట్టా రామచంద్రరావు మాట్లాడుతూ వైద్య సేవ తో పాటు సమాజ సేవకు అంకితమైన వ్యక్తి డాక్టర్ భాస్కరరావు అని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన వీరమాచినేని సత్యప్రసాద్ మాట్లాడుతూ అర్ధరాత్రి అపరాత్రి లేకుండా క్రమశిక్షణతో వైద్య వృత్తిని అకుంఠిత దీక్షతో పనిచేసిన డాక్టర్ గోగినేని మనమధ్య లేకపోవటం దురదృష్టం అని అన్నారు. రామకృష్ణ సేవా సమితి ద్వారా అనేక సేవలందించి తనదైన ముద్ర వేసిన మహోన్నత వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి డాక్టర్ భాస్కరరావు అని అన్నారు. ఈ కార్యక్రమంలో గన్నవరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధన రావు, జనసేన గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు , రాయపాటి శైలజ, డాక్టర్ భాస్కరరావు కుమార్తె డాక్టర్ గుండపనేని విస్ణు ప్రియ, అక్కినేని వనజ, గోగినేని శివరామ కృష్ణ, వేగుంట రాము, వేగిరెడ్డి సూర్యనారాయణ, దుట్టా శివన్నారాయణ, పుల్లయ్య చౌదరి , వేగిరెడ్డి సూర్యనారాయణ , వేగిరెడ్డి బాలాజీ, బి. జే. పి , నాయకులు తుమ్మల అంజిబాబు, తెలుగు దేశం పార్టీ నాయకులు వేగిరెడ్డి పాపారావు, వేములపల్లి శ్రీనివాసరావు, గుండపనేని ఉమా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా డాక్టర్ గోగినేని భాస్కరరావు చిత్రపటం వద్ద మౌనం పాటించి నివాలర్పించారు.

# ఆఫ్రికా బ్యాడ్మింటన్ గోల్డ్ మెడల్ విజేత హర్షవర్ధన్ రాయుడు




**కాకినాడ,అక్టోబరు 7 (వార్తాప్రభ) :** కాకినాడ జిల్లా అచ్చంపేటకు చెందిన వీరం రెడ్డి వెంకట హర్షవర్ధన్ రాయుడు ఇటీవల ఆఫ్రికాలో జరిగిన ఉగాండా ఇంటర్నేషనల్ డబుల్ బ్యాడ్మింటన్ సిరీస్ - 2024లో గోల్డ్ మెడల్ సాధించారు. హైదరాబాద్ గోపీచంద్ అకాడమీలో శిక్షణ పొందుతూ హర్షవర్ధన్ ఇప్పటికే అండర్ 19, అండర్ 17లో తన ప్రతిభను చాటుకున్నారు. గోపీచంద్ అకాడమీ తరఫున ఆఫ్రికాలో విజయకేతనం ఎగురవేసిన కర్ణాటకకు చెందిన నితిన్, అచ్చంపేటకు చెందిన హర్షవర్ధన్ నాయుడు లను కోచ్ గోపీచంద్ ప్రత్యేకంగా అభినందించారు. తన కుమారునికి బంగారు పతకం రావడం పట్ల తండ్రి వసంత రాయుడు,గ్రామస్తులు సంతోషం తో స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు.

# నిషేధిత భూములు జాబితా లో తొలగించిన భూముల వివరాలు ఇవ్వండి - కలెక్టర్లకు జాయింట్ సెక్రటరీ ఆదేశం



**విజయవాడ,అక్టోబరు 7 (వార్తాప్రభ) :** నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూములకు సంబంధించిన వివరాల నివేదికను అందజేయాలని సిసిఎల్ఏ జాయింట్ సెక్రటరీ జయలక్ష్మి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలోని కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన హాజరయ్యారు. నిషేధిత భూముల జాబితా నుంచి చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ జరిగినవి, చట్టాన్ని ఉల్లంఘించిన వాటి పూర్తి వివరాలను నివేదికలో స్పష్టంగా అందజేయాలని సీసీఎల్ఏ జాయింట్ సెక్రెటరీ వివరించారు. ఇప్పటికే సమర్పించిన వివరాలను పునఃపరిశీలించాలని ఆమె సూచించారు. రిజిస్ట్రేషన్ జరిగిన భూముల వివరాలను నివేదికలో పొందుపరచాలన్నారు. కాన్ఫరెన్స్ లో భూ సేకరణ సెక్షన్ సూపర్డెంట్ దుర్గాప్రసాద్ ఉన్నారు

# ఎస్విసిఇలో ఇస్రో ఆధ్వర్యంలో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు





**తిరుపతి,అక్టోబరు 7 (వార్తాప్రభ) :** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల వేదికగా రెండు రోజులపాటు ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. సామాన్యుల చెంతకు అంతరిక్ష పరిజ్ఞానాన్ని తీసుకెళ్లాలని ఉద్దేశంతో వినూతన కార్యక్రమాలను, విద్యార్థుల్లో ఉన్న శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి, ప్రోత్సహించేందుకు ఇస్రో ఈ వారోత్సవాలుకు శ్రీకారం చుట్టినట్లు షార్ అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం కరకంబాడి మార్గంలోని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల నందు ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, షార్ జనరల్ మేనేజర్ ఎన్. ఎస్.ఎస్.ఎన్ మూర్తి, డిప్యూటీ డైరెక్టర్ పి.సునీల్ , ఎస్ వి సి ఈ ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. సుధాకర్ రెడ్డి, సమన్వయకర్తలు డాక్టర్ డి. శ్రీనివాసులు రెడ్డి డాక్టర్ వి.మధురిమలు జ్యోతి ప్రజ్వలన గావించి ఘనంగా ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ వాతావరణ మార్పులకు అనుగుణంగా సాంకేతికంగా పరిశోధనలు కొనసాగిస్తూ, అంతరిక్ష సాంకేతికత వేగంగా మారుతున్న వాతావరణ పరిస్థితులకు సమర్థమైన, యోగ్యమైన పరిష్కార మార్గాలను కనుగొనాలని ఆకాంక్షించారు. విద్యార్థులు పాఠశాలల స్థాయి నుండే అంతరిక్ష సాంకేతిక అంశాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఇంజనీరింగ్ చదివే విద్యార్థులు వారి విద్యతోపాటు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం ఇస్రో ప్రతినిధులు మాట్లాడుతూ వాతావరణ మార్పులను గమనిస్తూ తత్సంబంధిత పరిశోధనలకు రాడార్లు ఉపగ్రహాలను ఆవిష్కరిస్తూ ఎప్పటికప్పుడు సమగ్రమైన విశ్లేషణ, సూచనలను ఇస్రో అందించగలుగుతుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ అంతరిక్ష వారోత్సవాలకు ఎస్వీసీని వేదికగా ఉంచినందుకు షార్ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. వాతావరణ అంశాలలో సవాలను సమ-ర్థంగా ఎదుర్కొనేందుకు అంతరిక్ష పరిశోధనల తాలూకా ఫలాలు ఉపయోగపడాలని తద్వారా మానవ మనుగడ భద్రతకు, భరోసా ఇవ్వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వైజ్ఞానిక ప్రదర్శనలు, వకృత్వ పోటీలు తదితర పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ఇవ్వడం జరిగింది. ఈ కార్య క్రమంలో స్పేస్ ఆన్ వీల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# సర్వసభ్య సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలి-ఎంపీపీ ప్రసన్న రాణి







**మైలవరం,అక్టోబరు 7 (వార్తాప్రభ) :** ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు తప్పని సరిగా హాజరుకావాలని ఎంపీపీ ఇస్లావతు ప్రసన్న రాణి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ సభామందిరం లో సోమవారం మధ్యాహ్నం ఎంపీడీవో పి.అనురాధ ఆధ్వర్యంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి కొంతమంది అధికారులు గైర్హాజర్ అవుతున్నారని అన్నారు. అలాగే మండలంలో జరిగే కార్యక్రమాల కు అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదన్నారు.అంగన్వాడి కేంద్రాల్లో నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి సిడిపిఓ స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోవడం సరికాదన్నా రు.ఎంపిటిసి సభ్యులు కోట వెంకటరెడ్డి పలు సమస్యలు లేవనెత్తారు.మైలవరం పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని ముందు పక్కా డ్రైనేజీలు ఏర్పాటు చేసిన తర్వాత సిసి రోడ్లు వేయాలన్నా రు.ఇటీవల సంభవించిన వరదల వల్ల పట్టణవాసులు ఎంత ఇబ్బంది పడ్డారో అందరికీ తెలుసని, డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలన్నా రు.అంతకుముందు శాఖల వారీగా అధికారులతో రివ్యూ నిర్వహించారు. మండల పరిషత్ కి సంబంధించి మూడు నెలల ప్రణాళికను ఎంపీడీవో సభలో చదివి వినిపించారు.ఈ సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్ లు,వివిధ శాఖ అధికారులు,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో అలరించిన భక్తి సంగీత కార్యక్రమాలు






**తిరుమల,అక్టోబరు 7 (వార్తాప్రభ) :** శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన సోమవారం తిరుమలలోని నాద నీరాజనం, ఆస్థాన మండపంలో టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో నిర్వహించిన ధార్మిక, సంగీత కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. తిరుమల నాద నీరాజనం వేదికపై ఉదయం 4.30 నుండి 5.30 గంటల వరకు ఎస్వీ సంగీత నృత్య కళాశాలకు చెందిన శ్రీమతి రవి ప్రభ, శ్రీ సుబ్రహ్మణ్యం, శ్రీ రామచంద్ర, శ్రీ చంద్ర శేఖర్ బృందం మంగళ ధ్వని, ఉదయం 5:30 నుండి 6:30 గంటల కాంచీపురానికి చెందిన చంద్రశేఖర పరమాచార్య యూనివర్శిటి కులపతి శ్రీ యమ్.యమ్.వెంపటి కుటుంబ శాస్త్రి “ ఋగ్వేదం-ఉదాత్త భావనలు “ అనే అంశంపై ఉపన్యసించారు. తర్వాత సాయంత్రం 4 నుండి 5 గంటల వరకు విజయవాడకు చెందిన కళారత్న శ్రీ మోదుమూడి సుధాకర్ బృందం అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. ఆస్థాన మండపంలో ఉదయం 7 నుండి 8 గంటల వరకు హైదరాబాద్ కు చెందిన శ్రీ సంపత్ కుమార్ బృందం “ విష్ణు సహస్రనామ పారాయణం “ ఉదయం 10 నుండి 11:30 గంటల వరకు తిరుపతికి చెందిన శ్రీ కె.సరస్వతి ప్రసాద్, కుమారి కోనేరు లక్ష్మీ స్వరాజ్యంల బృదం భక్తి సంగీతం, ఉదయం 11:30 నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నెల్లూరుకు చెందిన శ్రీ కె.భక్తవత్సలన్ “ముదలాళ్వారుల ప్రబంధాలలో శ్రీవారు” అనే అంశంపై ఉపన్యసించారు. అనంతరం సాయంత్రం 4 నుండి 5.30 గంటల వరకు తిరుపతికి చెందిన శ్రీ బుల్లెమ్మ బృందం అన్నమాచార్య సంకీర్తనలను సుమధురంగా ఆలపించారు. సాయంత్రం 5:30 నుండి రాత్రి 7 గంటల వరకు తిరుపతికి చెందిన లెక్చరర్ శ్రీ వేంకటేశ్వరులు బృందం భక్తి సంగీత కార్యక్రమం నిర్వహించారు.

# కరప మండల అంబేద్కర్ యువజన సేవా సంఘం అధ్యక్షులు గా మెండు గోవిందు





**కాకినాడ రూరల్//కరప,అక్టోబరు 7 (వార్తాప్రభ) :** కరప మండల అంబేద్కర్ యువజన సేవా సంఘం కమిటీ నియామకం ఏకగ్రీవంగా జరిగింది కమిటీ ఉపాధ్యక్షులుగా మోకన అశోక్ కుమార్ ప్రధాన సెక్రటరీగా పోలినాటి శ్రీనివాస్ సెక్రటరీగా మొగలి శ్యామ్ జాయింట్ సెక్రటరీగా పోలినాటి శ్రీనివాస్ (పెద్దాపురపాడు) ట్రెజరర్ గా లక్ష్మణ్ పోలినాటి గౌరవ అధ్యక్షులుగా... వారజార్జిరాజు,ఉబాఏడుకొండలు, పురం ప్రసాద్, జెల్ల శివకుమార్, వెంపల రమణ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది వీరి యొక్క పదవీకాలం ఐదు సంవత్సరాల కొనసాగుతుందని తీర్మానం చేశారు వీరు మండలం లోఉన్న అన్ని గ్రామాలలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన గ్రామ పెద్దల సహకారంతో గ్రామాలలో ఉన్న సమస్యలపై చర్చించి,ఆ గ్రామాలలో అభివృద్ధికి సహకారం దిశగా చర్యలు తీసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తారు అదేవిధంగా మౌలిక వసతుల, కల్పనకు చర్యలు తీసుకుంటారు.ఈ నూతనం గా ఎన్నికైన కమిటీ స్థానిక రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ ని కలిసి పుష్ప గుచ్ఛలు మరియు దుస్సాల్వతో సత్కరించినఅనంతరం ఎమ్మెల్యే పంతం నానాజీ ఏకగ్రీవంగా ఎన్నికైన సభ్యులపేర్లు తెలుసుకుని వారందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు మరియు ఎస్సీ నాయకులు పాల్గొన్నారు

# లలిత త్రిపుర సుందర దేవి అలంకరణలో అమ్మవారు



**నందిగామ,అక్టోబరు 7 (వార్తాప్రభ) :** దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా సోమవారం పల్లగిరి గట్టుపై త్రిశక్తి నిలయంలో వేంచేసియున్న శ్రీ కనకదుర్గ అమ్మవారు పంచమి రోజున శ్రీ లలిత త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. దేవాలయ అర్చకులు యనమదల రాజేష్ శర్మ లలిత త్రిపుర సుందరి దేవిగా అమ్మవారిని అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సామూహిక కుంకుమార్చన కార్యక్రమము నిర్వహించి తీర్థ ప్రసాద వినియోగము జరిపారు. ఉభయ దాతలు కమతం రాంబాబు, చాపలమడుగు వెంకట రమణ , కొనకంచి రమేష్ బాబు భక్తులకు తీర్థ ప్రసాదములను సమకూర్చారు.

# క్రిస్టల్ సిసిహెచ్ 03 ప్రత్తి విత్తనం అధిక దిగుబడి నిచ్చు రకం



**విస్సన్నపేట,అక్టోబరు 7 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని పుట్రేల గ్రామపంచాయతీ పరిధిలో రామానగరం గ్రామంలో క్రిస్టల్ కంపెనీ ఆధ్వర్యంలో రైతు క్షేత్రం స్థాయి ప్రదర్శన జంగా శివనాగిరెడ్డి పొలంలో ఏర్పాటు చేయడమైనది క్రిస్టల్ కంపెనీ టెరిటరీ మేనేజర్ జి.సందీప్ మాట్లాడుతూ ప్రతి విత్తనం సిహెచ్ 03 వెరైటీ రైతులకు అధిక దిగుబడి రావడంతో సుఖ సంతోషాలతో ఉన్నారని తెలియజేశారు. సి సి హెచ్ 3 ప్రత్తి ఆకులకు ఎక్కువ నూగు ఉండటం వల్ల పురుగు దోమ రసం పీల్చుదోమ తక్కువగా ఉండటంవల్ల రైతులకు పురుగు మందులు కూడా తక్కువ వాడటం జరుగుతుంది రైతులకు లాభం చేకూర్చుందని తెలిపారు .

# వనదేవతగా దర్శనమిచ్చిన బాలత్రిపుర సుందరి



**కోడూరు, అక్టోబరు 7 (వార్తాప్రభ) :** శ్రీదేవి శరన్నవరాత్రులు ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు సోమ వారం లింగారెడ్డి పాలెం గ్రామంలో వేయించేసి ఉన్న శ్రీ గోకర్ణేశ్వర స్వామి సమేత బాల త్రిపుర సుందరి అమ్మవారు వన దేవత గా దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు పెద్ద సంఖ్యలు భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# ఆర్. డి.ఓ.ను మర్యాదపూర్వకంగా కలిసిన టిడిపి నేత



**విసన్నపేట,అక్టోబరు 7 (వార్తాప్రభ) :** నూతనంగా చార్జి తీసుకున్న ఎన్టీఆర్ జిల్లా తిరువూరు ఆర్ డి ఓ కే మాధురిని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శావల దేవదత్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో పట్టు శాలువాతో సన్మానించి పూల బొకేతో సత్కరించారు.

